జనరాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 4 సంచిక - 19 పక్షపత్రిక అక్టోబర్ 16-31, 2013



S.S. చౌహాన్



ఫులాల్ తాన హావలా



షీలా దీక్షిత్



రమణ్‌సింగ్

## 5 రాష్ట్రాల ఎన్నికలు



అశోక్ గెహ్లాట్

# కాంగ్రెస్, బిజెపిల బల పరీక్ష









మీడియాతో ఇష్టా గోష్ఠి



సురాజ్య ఉద్యమ వెబ్‌పోర్టల్‌ను ప్రారంభిస్తున్న డా॥ జయప్రకాష్ నారాయణ్



లోక్‌సత్తా పార్టీ విజయాలపై సనత్‌నగర్‌లో ఎగ్జిబిషన్

జన రాజకీయం కోసం...
# లోక్‌సత్తా టైమ్స్
పక్షపత్రిక అక్టోబర్ 16-31, 2013
సంపుటి - 4 సంచిక - 19

## లోపలి పేజీల్లో...

రాజనీతిజ్ఞతను ప్రదర్శించండి ....................5
ప్రాంతీయ పార్టీలదే హవా ........................7
5 రాష్ట్రాల ఎన్నికలపై వ్యాసాలు....................9
చోళ సామ్రాజ్యంలో స్థానిక పాలన ...........14
పంచాయితీలే ప్రజాస్వామ్యానికి పునాది ...16
పంచాయితీలు - సమాచార హక్కు చట్టం ..18
ప్రజాస్వామ్య పరిరక్షణలో సుప్రీంకోర్టు ........23
భారత్ వృద్ధి రేటు 4.7 శాతమే ............... 24
గ్రేటర్‌లో బి.పి.ఎస్. పథకం ...................... 25
శంకరన్ స్మృతిలో... .................................26
నాగేశ్వరరావు మృతికి సంతాపం ............ 27
సురాజ్య ఉద్యమ వార్తలు ........................ 29
జిల్లా వార్తలు ..........................................30

## సంపాదకవర్గం
డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

డి.వి.వి.యస్. వర్మ
సంపాదకులు

సంపాదక వర్గం
పి. రవిమారుత్
బండారు రామ్మోహన్‌రావు
ఓంకార్
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : కె. శ్రీలత
ఫోటోలు : ఎన్. సంజీవ్ కుమార్

# పథకాలు, పందేరాలు, పందికొక్కులు

## సంపాదకీయం

ఓట్ల పథకాల రచనలో మనదేశానికి మించిన పాటవం మరెక్కడా కనిపించదు. ఓట్ల వేట కోసం జనాకర్షణ నినాదాలివ్వడంలో, కులమత, ప్రాంత, భాషాపరమైన అంశాల వినియోగంలో మననేతలకు మించిన చతురులు లేరు. ఇద ఒక క్షుద్ర రాజకీయ కళ. మనదేశంలో ప్రధాన పార్టీలు సృష్టించిన కళ. అదివాళ్ల పేటెంటు హక్కు. పేదరికం మనదేశానికి, ప్రజలకి ఒక శాపం. కాని ఈ నేతలకు అదే వరం. దానిని తొలగిస్తే వీళ్ల రాజకీయం బోల్తా పడుతుంది. పేదరికం మీద ప్రలోభాల మీద నిర్మించుకున్న అధికార సౌధం కూలిపోతుంది.

ఈ పేదరిక రాజకీయ కళలో రెండు రకాలున్నాయి. ఒకటి ప్రజల నిత్యజీవనానికి తప్పనిసరి కానివి, పేదరిక నిర్మూలనకు దోహదం కానివి. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు నేరుగా ఇచ్చే డబ్బు, మద్యం, చీరెలు, బిందెలు, సారెలు కాకుండా పార్టీలు తీము అధికారంలోకి వస్తే అందిస్తామనే పందేరాలు. కలర్ టీవీలు, ఫ్యాన్లు, మిక్సీలు, గ్రైండర్లు, తాళిబొట్లు, సెల్‌ఫోన్లు వగైరా వగైరాలు. అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు, ప్రజల సొమ్మును తమ ఓటు బ్యాంకు రాజకీయానికి వినియోగించడం, ప్రభుత్వ సొమ్ముతో ప్రజల ఓట్లు కొనుగోలు చెయ్యడం. సుప్రీంకోర్టు ఇది తగదని దీనిని నిరోధించడానికి చర్యలు తీసుకోమని ఎన్నికల కమీషన్‌ను కోరింది. ఎన్నికల కమీషన్ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమావేశాన్ని నిర్వహిస్తే ఒకటి రెండు చిన్న పార్టీలు తప్ప ఈ కళలో ఆరితేరిన పార్టీలన్నీ తమ వాగ్దాన హక్కుకు భంగం అంటూ తిరస్కరించాయి.

ఇక రెండో తరహావి ప్రజల జీవనానికి కొంత అవసరం వుంటుంది. ఆ పేరుతో ఇబ్బడి ముబ్బడిగా వర్తింపజేసే పథకాల రచనల దృష్టి కూడా ఓటు బ్యాంకు చుట్టూనే వుంటుంది.

ఏటా 40,000 కోట్లు ఖర్చుపెట్టే గ్రామీణ ఉపాధి హామీ పథకం. పేదలకు ఉపాధి రోజులను పెంచాల్సిన అవసరం ఉంది. ఒక ఉపాధి కల్పిస్తే అది ప్రత్యక్షంగా పరోక్షంగా మరో ఉపాధికి దారి తీయ్యాలి. ఉపాధి కోసమే ఉపాధి అంటూ తవ్విన గోతులే తవ్వడం, పూడ్చడం కార్యక్రమం అయితే అది ప్రయోజనకరమైన పని లేకుండా డబ్బులు పంచే పథకం అవుతుంది. అందువల్లనే ఇప్పుడు ఆ పథకం దారి మళ్లింది. కోట్ల రూపాయలు అధికారులు, రాజకీయగణం దక్కించు కుంటున్నారు.

ఏటా 80,000 కోట్లతో ప్రజా పంపిణీ సబ్సిడీలు అందించే పథకం ఇప్పుడు ఆహార భద్రత పేరుతో 1,20,000 కోట్లకు చేర్చారు. పేదలకు ఆహార సబ్సిడీ అవసరం. అయితే ఎంత మందికి ఇవ్వాలి, ఎలా ఇవ్వాలి అన్నది సమస్య. కాని పాలకులకి ఇది ఓట్ల పథకం. అందుచేతనే కుటుంబాల సంఖ్యకి మించిన కార్డులు పుట్టుకొస్తున్నాయి. కేవలం ఒక కిలో బియ్యం కొని, నిల్వచేసి, సరఫరా చెయ్యడానికి 8-10 రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది. దీనికి తోడు 100 కిలోల బియ్యం విడుదల చేస్తే 60 కిలోలే పేదలకు చేరుతున్నాయి. 40 శాతం దారి మళ్లుతున్నాయి. ఇందులో రాజకీయులు, అధికారగణం, డీలర్లు అంగా పాత్రధారులుగా వున్నారు. ఆహార సబ్సిడీ ఈ రూపంలోనే ఇవ్వాల్సిన అవసరం లేదు. పేదల్ని గుర్తించి వారికి నేరుగా నగదు బదిలీ చెయ్యవచ్చు. అలాచేస్తే పేదలకి ఇంతకు మించిన సబ్సిడీ అందించవచ్చు. ప్రభుత్వ ఖర్చు సగానికి తగ్గించవచ్చు. కాని పథకాల పేరుతో దోచుకోడానికి వీలుండదు. అందుకనే పార్టీలన్నీ వీటిని సమర్థిస్తున్నాయి. పథకాలు, పందేరాలు, పందికొక్కుల వ్యవస్థ యథేచ్ఛగా సాగిపోతున్నది. ■

# కార్టూన్ కార్నర్



*No, sir, this is neither a flood-hit nor a drought-hit area. We are only hit by bad government*

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**

*8-2-674బి/2/9, ప్లాట్ నం : 93*
*హ్యాపీ వ్యాలీ, రోడ్ నం.13ఎ,*
*బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034*

**ఫోన్ నంబర్లు :**
***040- 23311817, 23311819, 23311820, 23312829***
**ఫ్యాక్స్ : *040-23310612***

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311817**

విడి ప్రతి : రు. 10 ,
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# రాజనీతిజ్ఞతను ప్రదర్శించండి కేంద్రానికి, పార్టీలకు జేపీ విజ్ఞప్తి

ఒకపక్క తెలంగాణ ప్రజల బలమైన ఆకాంక్ష, మరోపక్క రాయలసీమ, కోస్తాంధ్ర ప్రజల బలమైన భయాందోళనలు, తమను చిన్నచూపు చూశారనే ఆవేదన ఉన్నప్పుడు మూడు ప్రాంతాల వారినీ కూర్చోబెట్టి సయోధ్యను కుదిర్చి కొంత అసంతృప్తితోనైనా ఆమోదయోగ్య పరిష్కారాన్ని సాధించే ప్రయత్నాన్ని చేయటంలో కేంద్రప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ఎటువంటి చిత్తశుద్ధిని, సామర్థ్యాన్ని, విశ్వసనీయతను ప్రదర్శించలేకపోయిందని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. జులై 30 నాటి సీడబ్లుసీ తీర్మానాన్నే యధాతథంగా కేంద్రం కేబినెట్ తీర్మానంగా అక్టోబర్ 3న ఆమోదించిందని, తాత్సారం తప్ప రాష్ట్రంలో ఆందోళనలు చేస్తున్న ప్రజల భయాలను పరిగణలోకి తీసుకుని సయోధ్యను కుదిర్చేందుకు ఈ 64 రోజులలో చేసిన ప్రయత్నమేముంది అని ప్రశ్నించారు. రాష్ట్రవిభజన సమస్యపై అసెంబ్లీలో చర్చించకుండా తాత్కాలిక రాజకీయ లబ్ధి కోసం రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వం ముందు దాసోహమన్నాయని, కేంద్రం పిచ్చివాని చేతిలో రాయిలాగా తన అధికారాన్ని వినియోగిస్తూ తెలుగు ప్రజల భవిష్యత్తుతో ఆడుకుంటోందని అన్నారు. తనకు సైనిక బలం, అన్ని శక్తులూ ఉన్నా ఒడుపు, దౌత్యం, పట్టువిడుపులతో సర్దార్ పటేల్ కేవలం 15 నెలల్లో 562 సంస్థానాలను విలీనం చేశారని, ఇప్పటి కేంద్రంలోని నేతలు మరుగుజ్జుల్లా వ్యవహరిస్తూ రాజకీయాన్ని చిన్నపిల్లల ఆటలా తయారుచేశారని అన్నారు.

**రాష్ట్ర విభజనపై కేంద్ర కేబినెట్ నిర్ణయంపై లోక్‌సత్తా పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావుతో కలిసి జయప్రకాష్ నారాయణ్ మీడియాతో మాట్లాడుతూ...** కదిలించ వీలులేని పర్వతం, ఆపనలవిగాని శక్తి రెండూ ఢీకొంటే వినాశనం తప్ప మరోటి ఉండదని, సినిమాల్లోలాగా ఏదోక దేవుడు ప్రత్యక్షమై అద్భుతాలు చేయడని అన్నారు. ఈ పరిస్థితికి కారణమైన రాజకీయ పార్టీలు ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకమైన మాటలతో, మోసాలతో ఇటు తెలంగాణలో, అటు సీమ, కోస్తాంధ్రలో ఓట్లు నంజుకుతినేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ నికృష్ట రాజకీయ క్రీడ వల్ల తెలుగు ప్రజలు, దేశం తీవ్రంగా నష్టపోతోందని, ఇంత జరిగాకైనా నేతలు కొంతయినా పశ్చాత్తాపంతో ముందుకొచ్చి ఓట్లు, సీట్లు కోసం కాకుండా తెలుగు ప్రజల ప్రయోజనాలు, జాతి నిర్మాణం కోసం రాష్ట్రంలో సంక్షోభ పరిష్కారం దిశగా చిత్తశుద్ధితో కృషి చేయాలని అన్నారు. "చేతులు కాలాకైనా ఆకులు పట్టుకోండి. ఇప్పటికైనా రాజనీతిజ్ఞతను ప్రదర్శించండి. ఆ పనిచేయకుండా ప్రజల్లో పెద్ద ఇమేజ్ కోసం హడావుడి చేస్తే చరిత్ర హీనులుగా మిగిలిపోతారు" అన్నారు. జాతీయస్థాయిలో ప్రధానపార్టీలైన కాంగ్రెస్, బీజేపీ భాగస్వాములందరినీ కూర్చోబెట్టి సమస్యలను పరిష్కరించే చొరవ చూపాలన్నారు. కోస్తా, రాయలసీమలోని సామాన్య ప్రజలు, రైతులు, యువత హింసను వీడి విజ్ఞతతో ఆలోచించాలని, ఇంతకాలంగా మనం చేస్తున్న ఆందోళనలతో సాధించిందేమిటో ఆత్మపరిశీలన చేసుకుని శాంతియుతంగా తమ అభ్యంతరాలను వ్యక్తంచేయాలని కోరారు. ముఖం మీద కోపంతో ముక్కు తెగ్గోసుకోవద్దని, మన రాష్ట్రాన్ని ఓ లెబనాన్‌లాగా, సోమాలియాలాగా, మనదేశంలోని కాశ్మీర్‌లాగా మార్చవద్దని అన్నారు. అంతర్యుద్ధంలోకి జారిపోతే మన వైపు చూసేవారే ఉండరని హెచ్చరించారు.

మూడు ప్రాంతాల్లో ఇంతబలంగా ఉద్యమాలు జరుగుతున్నప్పుడు బలవంతంగా ఎవరూ కలిపిఉంచలేరని, విడదయటం కూడా సాధ్యం కాదని, అలాచేస్తే నిరంతర సంక్షోభం కొనసాగుతుందని జేపీ అన్నారు. మేం చక్రవర్తులం, ఏం చేసినా చెలామణి అవుతుందని కేంద్రప్రభుత్వం, మా మాటే చెల్లాలని ఉద్యమకారులు అనుకుంటే పొరబాటని, ఫెడరల్, ప్రజాస్వామ్య వ్యవస్థలో అందరినీ కలుపుకుని ముందుకెళ్లటం

అవసరమని అన్నారు. ఇలాంటి వాతావరణంలో పరిష్కారం కావాలంటే, అవతలివారికి కొంత వెసులుబాటును ఇవ్వాలని అన్నారు. కేబినెట్ కమిటీ వేస్తున్నట్టు కేంద్రప్రభుత్వం ప్రకటించిందని, ప్రభుత్వం ఎంత పనికిమాలినదైనా ప్రభుత్వ కమిటీతో కూర్చుని నిర్దిష్ట పరిష్కారాలను తెలియచేస్తామని, ఉభయతారకంగా రాష్ట్రంలోని సంక్షోభాన్ని పరిష్కరించేందుకు తమ శక్తికి మించి లోక్‌సత్తా చేస్తున్న కృషిని కొనసాగిస్తామని తెలిపారు. ఇదే పరిస్థితులు కొనసాగితే, తెలుగుజాతి ఒక రాష్ట్రంగా ఉన్నా, ఎన్ని రాష్ట్రాలైనా నష్టపోతుందని, సామరస్యాన్ని పెంచి ఈ పరిస్థితిని సరిదిద్దేందుకు మీడియా కూడా నిర్మాణాత్మక పాత్ర పోషించాలని అన్నారు. ఈ సంక్షోభం పూర్తిగా కృత్రిమమైనదేనని, మనిషి సృష్టించిన సమస్యను పరిష్కరించటం పూర్తిగా సాధ్యమని అన్నారు.

రాష్ట్రంలో గత నాలుగేళ్లుగా ప్రభుత్వమే లేదని, సమస్య పరిష్కారం దిశగా కోస్తా, సీమ ప్రజలకు నచ్చచెప్పేందుకు తెలంగాణ మంత్రులు ఆ ప్రాంతంలో పర్యటించటం, తెలంగాణ ప్రజలకు నచ్చచెప్పేందుకు కోస్తా, సీమ ప్రాంత మంత్రులు అక్కడ పర్యటించటం ఎప్పుడైనా చేశారా అని జేపీ ఓ ప్రశ్నకు సమాధానంగా అన్నారు. సమైక్యాంధ్రప్రదేశ్ కోసం వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన రెడ్డి చేస్తున్న దీక్షపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, తనకు తెలిసి జగన్ తెలంగాణకు అనుకూలంగా మాట, లేఖ ఇచ్చి ప్రమాణం చేశారని, తర్వాత మాట మార్చారని, అలా ప్రజల్ని మభ్యపెట్టినవారు ఇంకా ఉన్నారు కాబట్టి ప్రత్యేకించి జగన్ గురించే మాట్లాడనక్కర్లేదన్నారు. సమాఖ్య వ్యవస్థలో రాష్ట్రాల సమాఖ్యగా దేశం ఏర్పడుతుంది కాబట్టి రాష్ట్ర ఉనికికి సంబంధించి తీసుకునే ఏ నిర్ణయాన్నయినా రాష్ట్ర శాసనసభలో ఆమోదించటం పరిణతిచెందిన జర్మనీ, కెనడా, అమెరికా వంటి ఫెడరల్ దేశాలలో జరుగుతుందని, మనదేశ రాజ్యాంగంలో ఆ మాట లేకపోయినా ప్రజాస్వామ్య, ఫెడరల్ వ్యవస్థలో అసెంబ్లీ అభిప్రాయాన్ని తోసిపుచ్చటం సరికాదని మరో ప్రశ్నకు సమాధానంగా జేపీ పేర్కొన్నారు.

లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వి.వి.ఎస్ వర్మ, బండారు రామ్మోహనరావు, కార్యదర్శి నందిపేట రవీందర్ మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ■

# లోక్‌సత్తా టైమ్స్ ప్రత్యేక సంచిక

## విడుదల తేదీ మార్పు

**లోక్‌సత్తా పార్టీ 7వ వార్షికోత్సవ సభ అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. అందువల్ల లోక్‌సత్తా టైమ్స్ ప్రత్యేక సంచిక విడుదల తేదీలను మార్చవలసి వచ్చింది.**

**నవంబరు 16-30 తేదీలతో వెలువడే లోక్‌సత్తా టైమ్స్ ప్రత్యేక సంచికగా విడుదలవుతుంది.**

**రాష్ట్రంలో రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యలపై ప్రత్యేక వ్యాసాలతో, విశేష సమాచారంతో ఈ సంచికను రూపొందిస్తున్నాం.**

**ఇప్పటికే ప్రకటనలు పంపినవారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఈ తేదీల మార్పును సహృదయంతో అర్థం చేసుకోవలసిందిగా కోరుతున్నాం.**

**ఇంకా ప్రకటనలు, వ్యాసాలు పంపదలచినవారు నవంబరు 10వ తేదీలోగా అందేలా పంపించి సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.**

– సంపాదక వర్గం

# 2014 ఎన్నికలు ప్రాంతీయ పార్టీలదే హవా

## 'ఇండియా టీవీ - టైమ్స్‌నౌ సీ ఓటర్ సర్వే'లో వెల్లడి

వచ్చే ఏడాది కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటులో ప్రాంతీయ పార్టీలు కీలకపాత్ర పోషించనున్నాయి. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కన్నా భాజపా సారథ్యంలోని ఎన్‌డీఏ ముందంజలో ఉండనుంది. ఆంధ్రప్రదేశ్‌లో తెరాస, వైకాపా చెరో 13 సీట్లను కైవసం చేసుకునే అవకాశం ఉంది. తెదేపా 8, కాంగ్రెస్ 7 సీట్లను గెల్చుకోనున్నాయి. 'ఇండియా టీవీ – టైమ్స్‌నౌ సీ ఓటర్ సర్వే'లో ఈ అంశాలు వెల్లడయ్యాయి. ఆగస్టు 16 – అక్టోబర్ 15 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా 24,284 మందిని ప్రశ్నించి ఈ సర్వే జరిపారు. ఫలితాలను వెల్లడించారు. ఆ వివరాలు..

- సాధారణ ఎన్నికలకు సెమీఫైనల్‌గా భావిస్తున్న రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, ఛత్తీస్‌గడ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తీవ్ర నిరాశ ఎదురుకానుంది. ఛత్తీస్‌గడ్‌లో తప్ప మిగిలిన మూడు రాష్ట్రాల్లోనూ ఆ పార్టీకి ప్రతికూల ఫలితాలు వస్తాయి.
- 2014 సాధారణ ఎన్నికల్లో భాజపా, శివసేన, అకాలీదళ్, ఆర్పీఐ–అథావలే, మేఘాలయ ఎన్సీపీ, హర్యానా జన్‌హిత్ కాంగ్రెస్‌లతో కూడిన ఎన్‌డీఏ కూటమికి 186 సీట్ల వరకూ దక్కే అవకాశం ఉంది. ఇప్పుడున్న భాగస్వామ్య పక్షాలతో కూడిన యూపీఏ 117 సీట్లకు పరిమితం కానుంది. 2009లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎన్సీపీ, ఆర్ఎల్‌డీ, జేఎంఎం, ముస్లింలీగ్, నేషనల్ కాన్ఫరెన్స్, కేరళ కాంగ్రెస్ (మణి)లతో కూడిన యూపీఏకు 259 లభించగా.. ఎన్‌డీఏ 159 సీట్లను కైవసం చేసుకుంది.
- ఏఐఏడీఎంకే, ఎస్పీ, బీఎస్పీ, వామపక్షాలు, తృణమూల్ కాంగ్రెస్, ఆర్జేడీ, బీజేడీ, తెరాస, వైకాపా వంటి ప్రాంతీయ పార్టీలు కీలకపాత్ర పోషించనున్నాయి. 543 సీట్ల లోక్‌సభలో ఈ పార్టీలన్నీ కలిపి 240 సీట్ల వరకూ గెల్చుకునే అవకాశం ఉంది.
- ఓట్ల శాతం విషయానికొస్తే.. ప్రాంతీయ పార్టీలు 38% వాటాతో అగ్రస్థానంలో ఉండగా, ఎన్‌డీఏ 35% ఓట్లను, యూపీఏ 27% ఓట్లను గెల్చుకోనున్నాయి.
- 2009లో 206 సీట్లను గెల్చుకున్న కాంగ్రెస్ ఈసారి 102 సీట్లకు పరిమితం కానుండగా, గత ఎన్నికల్లో 116 సీట్లు పొందిన భాజపా ఈసారి 162 సీట్లకు స్కోరును పెంచుకోనుంది.
- వామపక్షాలు 32 సీట్లను, బీఎస్పీ 31, ఎస్పీ 25, ఏఐఏడీఎంకే 28, తృణమూల్ కాంగ్రెస్ 23, ఆర్జేడీ 14, జేడీయూ 9 సీట్లను కైవసం చేసుకునే అవకాశం ఉంది.

  సాధారణ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్, యూపీ, రాజస్థాన్, కేరళ రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు ఎదురుగాలి వీయనుంది.
- 42 ఎంపీ సీట్లున్న ఆంధ్రప్రదేశ్‌లో తెరాస, వైకాపా చెరో 13 సీట్లను గెల్చుకుంటాయి. కాంగ్రెస్ 7 సీట్లకు పరిమిత మవుతుంది. గత ఎన్నికల్లో ఆ పార్టీ గెల్చుకున్న 33 సీట్లతో పోల్చితే ఇది చాలా తక్కువ. తెదేపా ఈ సారి 8 సీట్లను కైవసం చేసుకోనుంది.
- కేరళలో కాంగ్రెస్ 4 సీట్లకే (2006లో 13) పరిమితం కానుంది. వామపక్షాలు మాత్రం ఇప్పుడున్న 4 సీట్ల నుంచి 13కు స్కోరును పెంచుకోనున్నాయి.
- 26 సీట్లున్న గుజరాత్‌లో భాజపా 22 సీట్లలో (ప్రస్తుతం 15)పాగా వేస్తుంది. గత ఎన్నికల్లో 11 సీట్లున్న కాంగ్రెస్ 4 సీట్లకే పరిమితం కానుంది.
- ఉత్తరప్రదేశ్‌లో 22 సీట్లున్న కాంగ్రెస్ ఈసారి 5 సీట్లకు పడిపోనుంది. భాజపా ఇప్పుడున్న 10 సీట్లను 17కు పెంచుకోనుంది. బీఎస్పీ 31 స్థానాలను, ఎస్పీ 25 స్థానాలను కైవసం చేసుకోనున్నాయి.
- పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ 23 (ప్రస్తుతం 19), వామపక్షాలు 16 (ప్రస్తుతం 15), కాంగ్రెస్ 3 (ప్రస్తుతం 6) సీట్లను గెల్చుకోనున్నాయి.

- కాంగ్రెస్ పాలిత రాజస్థాన్‌లో భాజపా పుంజుకోనుంది. మొత్తం 25 సీట్లున్న ఈ రాష్ట్రంలో భాజపా 19 సీట్లతో ప్రభంజనం సృష్టించనుంది. ప్రస్తుతం ఆ పార్టీకి ఉన్నవి 5 స్థానాలు మాత్రమే. 20 స్థానాలున్న కాంగ్రెస్ స్కోరు ఐదు స్థానాలకు పడిపోనుంది.
- మధ్యప్రదేశ్‌లో భాజపా 23 స్థానాల్లో విజయకేతనం ఎగురవేయనుంది. ప్రస్తుతం ఆ పార్టీకి ఉన్న స్థానాల సంఖ్య 18. మరోవైపు 11 సీట్లున్న కాంగ్రెస్ ఆరు స్థానాలకు పరిమితం కానుంది.
- ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్‌కు కొంత ఊరట లభించనుంది. గత ఎన్నికల్లో ఒక్క సీటుకే పరిమితమైన ఆ పార్టీకి ఈసారి మూడు స్థానాలు దక్కనున్నాయి. 10 సీట్లున్న భాజపా రెండింటిని కోల్పోయి 8 స్థానాలతో సరిపెట్టుకొనే పరిస్థితి రావచ్చు.
- మొత్తం ఏడు సీట్లున్న ఢిల్లీలో కాంగ్రెస్ ఈసారి 3 సీట్లకు (ప్రస్తుతం 7) పరిమితం కానుండగా.. మిగిలిన నాలుగింటిని భాజపా (ప్రస్తుతం సున్నా) కైవసం చేసుకుంటుంది.
- పంజాబ్‌లో శిరోమణి అకాలీదల్-భాజపా కూటమి 9 సీట్లను, కాంగ్రెస్ నాలుగు సీట్లను గెల్చుకునే అవకాశం ఉంది.
- కర్ణాటకలో కాంగ్రెస్ 13 సీట్లను గెల్చుకుంటుంది. భాజపాకు 12 సీట్లు దక్కనున్నాయి.
- తమిళనాడులో ఏఐఏడీఎంకే 28 స్థానాలను గెల్చుకోనుంది. డీఎంకే ఇప్పుడున్న 18 నుంచి ఐదు సీట్లకు పడిపోనుంది.
- మహారాష్ట్రలో ఎన్సీపీ స్కోరు 8 నుంచి ఆరుకు, కాంగ్రెస్ స్కోరు 16 నుంచి 11కి తగ్గనుంది. ■

# రాష్ట్ర క్రమశిక్షణా సంఘం నిర్ణయాలు



రాష్ట్ర క్రమశిక్షణా సంఘం సమావేశం ది. 26-09-2013న జరిగినది. ఈ సమావేశంలో గత సమావేశాలలో కూలంకషంగా చర్చించి, తయారుచేసిన రాష్ట్ర క్రమశిక్షణా సంఘం, జిల్లా క్రమశిక్షణా సంఘాలు అనుసరించవలసిన విధివిధానాలు, క్రమశిక్షణా చర్యలు తీసుకోదగిన అంశాలు, చేపట్టే చర్యల గురించి చర్చించి ఆమోదించడమైనది.

నరసరావుపేట నియోజకవర్గ అధ్యక్షులు శ్రీ ఈదరగోపిచంద్, కార్యదర్శి శ్రీ బి. వేణుగోపాలరావులను లోక్‌సత్తా పార్టీ గుంటూరు జిల్లా శాఖ సస్పెండ్ చేస్తూ తీసుకున్న చర్య గురించి, ఇరుపక్షాల వాదనలు, సాక్ష్యాలు సమగ్రంగా పరిశీలించిన తదుపరి గుంటూరు జిల్లా శాఖ తీసుకున్న నిర్ణయం సరియైనదిగా భావిస్తూ తీర్మానించడమైనది. ఈ విషయం సంబంధిత వ్యక్తులకు, పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షునికి, రాష్ట్ర పార్టీ అధ్యక్షునికి తెలియజేయడం జరిగింది.

ఈ సమావేశానికి రాష్ట్ర క్రమశిక్షణా సంఘం ఛైర్మన్ శ్రీ పి. కోదండరామారావు, మెంబర్ శ్రీ పి. చంద్రమౌళి, కార్యదర్శి యల్.వి.రామరాజు హాజరైనారు.

# ఎన్నికలకు సన్నద్ధం అవుతున్న 5 రాష్ట్రాలు

ఛత్తీస్‌గడ్, మధ్యప్రదేశ్, మిజోరాం, రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాల శాసనసభలకు నవంబరు-డిసెంబరు నెలలలో సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. 2014లో జరగనున్న పార్లమెంటు ఎన్నికలకు ముందు ఈ ఎన్నికలు జరుగుతున్నందున వీటికి ఎన్నికల విశ్లేషణ ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నారు. అలాగే రాజకీయ పార్టీలు కూడా ఈ ఎన్నికలను తుదిపోరుకు సన్నాహక పోటీగా బలపడుతున్నాయి.

ఛత్తీస్‌గడ్‌లో నవంబరు 11, 19 తేదీలలో రెండు విడతలుగానూ, మధ్యప్రదేశ్‌లో నవంబరు 25న, రాజస్థాన్‌లో డిసెంబరు 1న, ఢిల్లీ, మిజోరాంలలో డిసెంబరు 4న ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల కమీషన్ ప్రకటించింది.

ఈ 5 రాష్ట్రాల ఎన్నికల ఓట్ల లెక్కింపు మాత్రం డిసెంబరు 8వ తేదిన జరుగుతుంది.

వివిధ రాష్ట్రాలలో ఓట్లు, పోలింగ్ స్టేషన్ల వివరాలు

| రాష్ట్రం పేరు | ఓటర్ల సంఖ్య | పోలింగ్ స్టేషన్ల సంఖ్య |
|---|---|---|
| ఛత్తీస్‌గడ్ | 1,67,96,174 | 21,418 |
| మధ్యప్రదేశ్ | 4,64,57,724 | 53,896 |
| మిజోరాం | 6,86,305 | 1,126 |
| రాజస్థాన్ | 4,06,08,056 | 45,334 |
| ఢిల్లీ | 1,15,07,113 | 11,763 |

ఎన్నికలు జరుగునున్న ఈ 5 రాష్ట్రాలలో శాసనసభ స్థానాలు, రిజర్వేషన్ల వివరాలు

| రాష్ట్రం పేరు | శాసనసభ స్థానాలు | S.C. రిజర్వుడ్ | S.T. రిజర్వుడ్ |
|---|---|---|---|
| ఛత్తీస్‌గడ్ | 90 | 10 | 29 |
| మధ్యప్రదేశ్ | 230 | 35 | 47 |
| మిజోరాం | 40 | - | 39 |
| రాజస్థాన్ | 200 | 34 | 25 |
| ఢిల్లీ | 70 | 12 | - |

# మహిళలకు చోటు దక్కని మిజోరాం

మిజోరాం రాష్ట్రం కొన్ని రంగాలలో మంచి పురోగతి సాధించినా చట్టసభలలో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించడంలో చాలా వెనకబడి వుంది.



మిజోరాంలో మొత్తం ఓటర్లు 6,86,350. శాసనసభ నియోజకవర్గాల సంఖ్య 40. ఈ ఓటర్లలో 3,49,506 మంది మహిళలు అంటే 51 శాతం మంది మహిళలు. అయితే శాసనసభలో మహిళల ప్రాతినిధ్యం దాదాపు శూన్యం. ఇప్పటివరకు జరిగిన అన్ని ఎన్నికల్లోనూ ముగ్గురే ముగ్గురు మహిళలు చట్టసభల గడప తొక్కారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా 1979లో తమ్మావి, 1984లో ధాన్సియామిలు, మిజోనేషనల్ ఫ్రంటు అభ్యర్థిగా 1987లో లాల్ హిలిమ్‌పీలు మాత్రమే వున్నారు.

2008 ఎన్నికల్లో పార్టీలన్నీ కలిసి 9 మంది మహిళలకు సీట్లు, 2003లో 7, 1998లో 10 మందికి సీట్లు ఇచ్చాయి. అందరూ ఓటమి పాలయ్యారు.

2010లో జరిగిన ఐజోల్ మున్సిపల్ ఎన్నికలలో 19 స్థానాలలో 6 స్థానాలు మహిళలకు రిజర్వు చేశారు.

మిజో మహిళలు చాలా రంగాలలో ముందున్నారు. కాని రాజకీయ రంగంలో మాత్రం వెనకబడ్డారు. ■

# 5 రాష్ట్రాలలో శాసనసభ ఎన్నికల కాంగ్రెస్, బిజెపిలకు బలాబలాల పరీక్ష

నవంబరు, డిసెంబరు నెలలో 5 రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికల నిర్వహణ తేదీలను భారత ఎన్నికల సంఘం ప్రకటించింది. ఛత్తీస్‌గడ్‌లో నవంబరు 11, 19 తేదీలలో రెండు విడతలుగాను, మధ్యప్రదేశ్‌లో నవంబరు 25, రాజస్థాన్‌లో డిసెంబరు 1, ఢిల్లీ, మిజోరాంలలో డిసెంబరు 4న ఎన్నికలు జరుగనున్నాయి.

ఈ ఎన్నికలలో మొదటిసారిగా సుప్రీంకోర్టు తీర్పు మేరకు అభ్యర్థుల తిరస్కరణ ఓటు హక్కుకు అవకాశం కల్పించనున్నారు. అలాగే సుప్రీంకోర్టు ఇచ్చిన మరో తీర్పు ప్రకారం ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలలో ఇవ్వాల్సిన సమాచారాన్ని దాచిపెడితే వారిని పోటీకి అనర్హుల్ని చేసే అంశాన్ని అమలు చెయ్యడానికి వీలుగా ఎన్నికల కమీషన్ చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటించింది.

వీటితోపాటు ఎన్నికల ఖర్చుకు సంబంధించి చట్టవిరుద్ధంగా సాగించే విచ్చలవిడి ఖర్చుల మీద నిఘా పెంచనున్నట్లు, నగదు వార్తల ప్రచారానికి అడ్డుకట్ట వేయనున్నట్లు ప్రకటించింది.

ఎన్నికల కమీషన్ ప్రకటనల గాంభీర్యానికి, ఆచరణలో అమలు చేయడానికి వున్న తేడా అందరికీ తెలిసిందే. అయినా ప్రధాన ఎన్నికల కమీషనర్ వి.యస్.సంపత్ తన ప్రకటనలకు కట్టుబడి గట్టి చర్యలు తీసుకుంటారని భావిద్దాం. మొత్తం మీద ఎన్నికల కమీషన్‌కు ఇదొక సవాల్. దీనిని సమర్థవంతంగా అమలు చేస్తుందని ఆశిద్దాం.

**మధ్యప్రదేశ్ ఎన్నికల ఫలితాలు - 2008**

| SN | Party | Seats Contested | Seats won | Seats Changed | % Votes |
|---|---|---|---|---|---|
| 1 | Bharatiya Janata Party | 228 | 143 | - 30 | 37.64 |
| 2 | Indian National Congress | 228 | 71 | + 33 | 32.39 |
| 3 | Bahujan Samaj Party | 228 | 7 | + 5 | 8.97 |
| 4 | Bharatiya Jan Shakti Party | 201 | 5 | + 5 | 4.71 |
| 5 | Independents | | 3 | + 1 | 8.23 |
| 6 | Samajwadi Party | 187 | 1 | - 6 | 1.99 |
| | Total | | 230 | | |

ఇకపోతే ఎన్నికలలో తొలిసారి ఓటు వేస్తున్న వారి సంఖ్య దేశంలో 15 కోట్లకు పెరిగింది. ఈ 5 రాష్ట్రాలలోనూ అలాంటి ఓటర్లు గణనీయంగానే వున్నారు. వీరు ఓటర్లుగా నమోదు కావడంతోనే సరిపెట్టుకుంటారా? అత్యధికులు ఓటు వేసే ఉత్సాహాన్ని చూపిస్తారా? ఈ కొత్త ఓటర్ల ప్రభావం పాత పార్టీల మీద, ఢిల్లీలో కొత్తగా వచ్చిన పార్టీ మీద ఎలాంటి ప్రభావం చూపిస్తుంది అన్నది ఈ ఎన్నికలలో కొంతమేరకు స్పష్టటం కానున్నది.

**కాంగ్రెస్-భాజపాలకు ఎన్నికల పరీక్ష**

ఈ 5 రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు 2014 ఎన్నికలకు రిఫరెండమ్ లాంటిదని, దీనిని సెమీఫైనల్స్‌గా పత్రికలు, విశ్లేషకులు, వార్తా ఛానళ్లు ప్రచారం చేస్తున్నాయి. ఈ ఎన్నికలు 2014 పార్లమెంటు ఎన్నికల మీద కొంతమేర ప్రభావాన్ని కలిగిస్తుందే కాని దీని ప్రకారమే మిగతా రాష్ట్రాల ప్రజల స్పందన వుంటుందని భావించడానికి ఎంతమాత్రం వీలులేదు.

ఇప్పుడు జరుగుతున్న 5 రాష్ట్రాలలో 4 రాష్ట్రాలలో కాంగ్రెస్, బిజెపిల మధ్యే ప్రధాన పోటీ వున్న రాష్ట్రాలు. ఇందులో ఢిల్లీ, రాజస్థాన్‌లలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వుండగా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్‌లలో బిజెపి అధికారంలో వుంది. ఒకరు అధికారంలో లేనిచోట మరొకరు ప్రధాన ప్రతిపక్షంగా వున్నారు.

**రాజస్థాన్ ఎన్నికల ఫలితాలు - 2008**

| SN | Party | Seats won | Seats Changed |
|---|---|---|---|
| 1 | Indian National Congress | 96 | + 40 |
| 2 | Bharatiya Janata Party | 78 | - 42 |
| 3 | Independents | 14 | - 1 |
| 4 | Bahujan Samaj Party | 6 | + 4 |
| 5 | Communist Party of India (Marxist) | 3 | + 2 |
| 6 | Loktantrik Samajwadi Party | 1 | + 1 |
| 6 | Janata Dal (United) | 1 | - 1 |
| | Total | 199/200 | |

మిగిలిన 5వ రాష్ట్రం మిజోరాంలో బిజెపికి బలం లేదు. అక్కడ కాంగ్రెస్ పార్టీ స్థానిక ప్రాంతీయ పార్టీలతో తలపడుతున్నది.

దేశంలో మిగిలిన రాష్ట్రాలలో ఒకటిరెండు మినహా ఇస్తే మిగిలిన అన్ని రాష్ట్రాలలోనూ కాంగ్రెస్, బిజెపిలు బలహీనంగా వుండడం లేదా ఏదో ఒక మిత్రపక్షం పంచన చేరి పోటీ చేసే స్థితిలో వున్నాయి. అత్యధిక రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలే ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. అందుచేత ఈ 5 రాష్ట్రాల ఎన్నికలే దేశానికి దిశానిర్దేశం చేసే స్థితి లేదు. అక్కడ ప్రతి రాష్ట్రంలోనూ పరిస్థితి వేర్వేరుగా వుంది. ఫలితాలు వేర్వేరుగానే వుంటాయి.

**వివిధ రాష్ట్రాలు - పోటీల తీరు**

మిజోరాంలో 2008 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మొత్తం 40 శాసనసభ స్థానాలలో 32ను గెలుచుకుంది. ఇప్పుడు అక్కడ పరిస్థితి భిన్నంగా వుంది. కాంగ్రెస్ ప్రభుత్వం మిజోనేషనల్ ఫ్రంటు నుండి తీవ్రమైన పోటీని ఎదుర్కొంటున్నది. కాంగ్రెస్‌కు గెలుపు లభించినా అది చావుతప్పి కన్నులొట్టపోయినట్లుగానే వుంటుంది.

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్‌లలో బిజెపి మరోసారి గెలుపు కోసం ప్రయత్నిస్తుంది. పోల్ సర్వేల అంచనాల ప్రకారం ఈ రెండు రాష్ట్రాలలోనూ బిజెపి గెలిచే అవకాశాలు బాగా వున్నాయి. అయితే ఈ రెండు రాష్ట్రాలలోనూ కాంగ్రెస్ పార్టీ గతంలో కంటే తన బలాన్ని గణనీయంగా పెంచుకుంటుందని పోల్ సర్వేలు అంచనా వేస్తున్నాయి.

ఇక కాంగ్రెస్ పాలిత రాజస్థాన్, ఢిల్లీలలో ప్రభుత్వాల వ్యతిరేక గాలి తీవ్రంగా వున్నట్టు పోల్ సర్వేలు ప్రకటిస్తున్నాయి. ఇందులో రాజస్థాన్‌లో బిజెపి గెలుపు దాదాపు ఖాయం అని అవి ప్రకటిస్తున్నాయి.

ఢిల్లీలో మాత్రం పోటీ అత్యంత తీవ్రంగా వుంటుందని సర్వేలు అంచనా వేస్తున్నాయి. మొత్తం మీద ఈ రాష్ట్రాలలో కాంగ్రెస్ ఎదురీతలో వుంది.

మిజోరాం, ఛత్తీస్‌గడ్ మినహా మిగిలిన రాష్ట్రాలలో బి.యస్.పి కి కొంత బలం వుంది. దాని బలం పెరిగినా తరిగినా నామమాత్రంగానే వుంటుంది. ఇకపోతే ఢిల్లీలో కేజ్రీవాల్ నాయకత్వంలో కొత్తగా ఏర్పడిన ఆమ్ ఆద్మీ పార్టీ చూపించే ప్రభావం మీద రకరకాల అంచనాలు వినిపిస్తున్నాయి. వివిధ సర్వేలు, అంచనాల ప్రకారం ఆ పార్టీకి 5 నుండి 12 స్థానాల మధ్య గెలుపు వుంటుందని భావిస్తున్నారు. అలాగే 15-20 శాతం ఓట్లు వస్తాయని అంచనా వేస్తున్నారు.

ఒక కొత్త పార్టీకి ప్రత్యేకించి సంప్రదాయ రాజకీయ పార్టీలకున్న సాధనసంపత్తి లేని పార్టీకి, అవినీతికి వ్యతిరేకంగా కొత్త తరహా రాజకీయ ప్రయోగానికి ఇది మంచి తొలి అడుగు అవుతుంది. అయితే మాయావతి, కేజ్రీవాల్ పార్టీల పోటీ కాంగ్రెస్, బిజెపిల మధ్య జరుగుతున్న పోరు మీద ఎలాంటి ప్రభావాన్ని చూపుతుంది, ఎన్నికల తర్వాత ఈ రెండు పార్టీలు ఢిల్లీలో ప్రభుత్వం ఏర్పాటుకు ఎవరికి తోడ్పాటునిస్తారు అన్న విషయాలు ఎన్నికల ఫలితాల తర్వాత తేలాల్సిన అంశాలుగానే వున్నాయి.

**మిజోరాం ఎన్నికల ఫలితాలు - 2008**

| SN | Party | Seats won | Seats Change |
|---|---|---|---|
| 1 | Indian National Congress | 32 | + 20 |
| 2 | Mizo National Front | 3 | - 18 |
| 3 | MPC | 2 | 0 |
| 4 | Zoram Nationalist Party | 2 | 0 |
| | Total | 40 | |

**ఢిల్లీ ఎన్నికల ఫలితాలు - 2008**

| SN | Party | Seats Contested | Seats won | Seats Changed | % Votes |
|---|---|---|---|---|---|
| 1 | Indian National Congress | 69 | 43 | - 4 | 40.31 |
| 2 | Bharatiya Janata Party | 69 | 23 | + 3 | 36.34 |
| 3 | Bahujan Samaj Party | 69 | 2 | + 2 | 14.05 |
| 4 | Lok JanShakti Party | 41 | 1 | +1 | 0.07 |
| 4 | Independent | | 1 | 0 | 3.92 |
| | Total | | 70 | | |

**ఛత్తీస్‌గడ్ ఎన్నికల ఫలితాలు - 2008**

| SN | Party | Seats Contested | Seats won | Seats Changed | Vote Share |
|---|---|---|---|---|---|
| 1 | Bharatiya Janata Party | 90 | 50 | 0 | 40.33 |
| 2 | Indian National Congress | 87 | 38 | + 1 | 38.63 |
| 3 | Bahujan Samaj Party | 90 | 2 | 0 | 6.11 |
| | Total | | 90 | | |

# ఢిల్లీలో జ్యోతిష్కులకు క్యూ కడుతున్న నేతలు

ఎన్నికల్లో తమ తారాబలం తెలుసుకోడానికి ఢిల్లీలో రాజకీయ నాయకులు ఇప్పుడు జ్యోతిష్కుల దగ్గర మోకరిల్లుతున్నారు. ఇది పార్టీలు తమకు టిక్కెట్లు ఇచ్చే అవకాశాల దగ్గర నుండి నామినేషన్లు వెయ్యడానికి ముహూర్తాలు, ఏ బట్టలు ధరించాలి, ఏ పచ్చలు వాడాలి, ఎలా పిలిపించుకోవాలి వరకు అన్ని అనుమానాలకు, శంకలకు ఒకటే మందు చిలకజోస్యం, చేతి రేఖల మహత్యం.

ఒకవేళ తారలు, గ్రహాలు అనుకూలించకపోతే వాటిని శాంతిపరిచే మార్గాలు, పూజలు, దక్షిణాలు వగైరాలన్నీ ఢిల్లీలో యధావిధిగా సాగిపోతున్నాయి.

బి.బి.శర్మ 56 ఏళ్లు వున్న జ్యోతిష్కుడు. ఆయన దగ్గరకు ఢిల్లీ నాయకులు చాలా మంది క్యూ కడతారు. ఈ శర్మ మీద ఎందుకంత నమ్మకం అంటే ఆయన తాత మంగత్‌రామ్ శర్మ 1947లో భారత స్వాతంత్ర్య ప్రకటనకు ముహూర్తం పెట్టిన ముగ్గురు జ్యోతిష్కులలో ఆయన ఒకరు.

శర్మ మాటల్లో చెప్పాలంటే రాజకీయాలలో తారల పాత్ర చాలా వుంటుందని తాను జాతకాలను ఎక్స్‌రేల లాగా పరిశీలిస్తానని, పార్టీ అభ్యర్థులు ప్రతి పని శుభలగ్నంలోనే చెయ్యాలను కుంటారని అది తమ పార్టీ కంటే తమకు వ్యక్తిగతంగా లాభిస్తుందని భావిస్తారని అంటున్నారు.

మరో 58 ఏళ్ల అశోక్ సనోరియా ప్రధానంగా ఇంగ్లీషు మాట్లాడే జ్యోతిష్కుడు. తన దగ్గరకు వచ్చేవారిలో 80 శాతం మంది బి.జె.పి కి చెందిన వారేనని అంటున్నారు. అభ్యర్థులు ఎలాగైనా గెలవాలన్న తపనతో ఉంటారు. అందుచేత వారు బలమైన ముహూర్త కాలంలో నామినేషన్లు వెయ్యాలను కుంటారు. అలాగే ఎలాంటి దుస్తులు ధరించాలి, ఎంత మార్జిన్‌తో గెలుస్తాం అనే ప్రశ్నలు అడుగుతారని ఆయన అంటున్నారు.

ఈ సారి ఎన్నికల్లో చాలామంది బి.జె.పి అభ్యర్థుల వైపే తారాబలం వున్నదని, నరేంద్రమోడీకి చాలా బలమైన గ్రహబలాలున్నాయని, అవి ఆ పార్టీ అభ్యర్థుల విజయానికి దోహదం చేస్తాయని అంటున్నారు.

మరొకరు అజయ్ భాంబీ. చాలామంది పేరున్న రాజకీయ నాయకులు తన దగ్గరికి వస్తారని వారికి గెలిచే వ్యూహరచనతో పాటు, దైవశక్తుల తోడ్పాటు పొందే అంశాలతో తన సహకారాన్ని అందిస్తున్నాను అని అంటున్నారు.

రాజకీయ నాయకుల గ్రహస్థితిని మార్చడానికి చక్కదిద్దడానికి అవసరమైన పూజా కార్యక్రమాలను, చేయవలసిన దానధర్మాలను, పారాయణం చేయవలసిన మంత్రాలను ఇప్పటికే చాలామందికి అందించినట్లు ప్రముఖ జ్యోతిష్కులు అశోక్ సనోరియా, బి.బి.శర్మలు తెలియజేస్తున్నారు. పైకి కొందరు తమకు ఇలాంటి నమ్మకాలు లేవని బుకాయింపు ప్రకటనలు చేస్తున్నా నిజానికి దేశంలో అందరికంటే జ్యోతిష్కుల మీద రాజకీయ నాయకులకే ఎక్కువ నమ్మకం వుంది. అందుకే వారిలో అత్యధికులు జ్యోతిష్కులు చెప్పిన సమయానికే నామినేషన్లు వేస్తున్నారు. వారు సూచించిన రంగు దుస్తులనే వాడుతున్నారు. చెప్పిన పచ్చల రాళ్లనే ధరిస్తున్నారు. అయితే కేవలం జ్యోతిష్యాన్ని నమ్ముకుంటే గట్టెక్కలేమని వారికి తెలుసు అని ఒక పేరు చెప్పడానికి నిరాకరించిన రాజకీయ నాయకుడు అన్నారు. ■



# ఒడిషా మున్సిపల్ ఎన్నికల్లో బీజేడీ ఘన విజయం

**పరాజయం పాలైన కాంగ్రెస్, బి.జె.పి.**

ఒడిషాలో 66 మున్సిపల్ పట్టణాలకు ఎన్నికలు జరిగాయి. నవీన్ పట్నాయక్ నాయకత్వంలోని బి.జె.డి విజయ పతాకాన్ని ఎగరవేసింది. ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాని మరో 10 మున్సిపాలిటీలలో పార్టీల బలాబలాల రీత్యా బి.జె.డి యే కైవశం చేసుకునే వీలుంది.

ఇక వార్డులపరంగా చూస్తే బి.జె.డి విజయం మరింత స్పష్టంగా కనిపిస్తున్నది. ఎన్నికలు జరిగిన 1121 వార్డులలో బి.జె.డి 57 శాతం వార్డులను గెలుచుకుంది.

కాంగ్రెస్ పార్టీ అందులో సగం కూడా గెల్చుకోలేదు. బి.జె.డి కి 642 వార్డులు రాగా కాంగ్రెస్‌కు 318 వార్డులనే గెలుచుకుంది.

ఇక బి.జె.పి పరిస్థితి మరీ దయనీయంగా వుంది. 25 శాతం వార్డులు గెలుస్తాయని బీరాలు పలికిన బి.జె.పి కేవలం 47 వార్డులతో 4.19 శాతానికి పరిమితం అయింది. 40 మున్సిపాలిటీలలో బి.జె.పి కి వార్డులలో గెలుపు ఖాతాలే లేకుండా పోయాయి.

ఇకపోతే ఇండిపెండెంట్లు 101 స్థానాలను, ఇతరులు 10 స్థానాలను గెలుచుకున్నారు. స్పష్టమైన మెజారిటీ రాని మున్సిపాలిటీలలో ఇండిపెండెంట్లు కీలకపాత్ర పోషించ నున్నారు. అధికార పార్టీ వీరిని ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నది.

గత ఎన్నికలలో (2008) బి.జె.పి 11 మున్సిపాలిటీలలో పూర్తి మెజారిటీని సాధించగా ఇప్పుడు ఒక్క మున్సిపాలిటీలలో కూడా సాధారణ మెజారిటీ సాధించలేకపోయింది.

ఇక కాంగ్రెస్ పార్టీ 2008లో 9 మున్సిపాలిటీలలో మెజారిటీ సాధించగా ఇప్పుడు మరొకటి పెంచుకుని 10 మున్సిపాలిటీలలో సాధారణ మెజారిటీ సాధించింది. అయితే ఇది కాంగ్రెస్‌కు మాత్రం ఊరట కలిగించేదిగా లేదు ఎందుకంటే బి.జె.పి కోల్పోయిన వాటినైనా కాంగ్రెస్ గెలుచుకోలేకపోయింది. వీటన్నింటినీ బి.జె.డి ఆక్రమించుకుంది.



2014లో ఒడిషా రాష్ట్ర శాసనసభకు, పార్లమెంటుకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బి.జె.పి తీవ్రంగా భంగపడింది. నరేంద్రమోడీ గాలితో పెను తుఫాను సృష్టిస్తానని భావించిన బి.జె.పి కి కోలుకోలేని ఎదురు దెబ్బ తగిలింది. నరేంద్రమోడీ ఈ జూలై నెలలో పూరిలో రథయాత్ర సందర్భంగా విచ్చేశారు. అయినా పూరిలో వున్న 22 మున్సిపల్ వార్డులలో బి.జె.పి రెండు మాత్రమే గెల్చుకుంది.

మరోపక్క ఈ మూడు పార్టీలు అంతర్గత చిక్కుల్లో వున్నాయి. నవీన్ పట్నాయక్ బి.జె.డి లో ప్రముఖుడుగా, ఎన్నికల ప్రచార వ్యూహాల దిట్టగా పేరుపొందిన ప్రయిమోహన్ మహాపాత్రను పార్టీ నుండి ఈ ఎన్నికల ముందు బహిష్కరించారు. ఈ బహిష్కరణతో బిజెపి కి తీవ్రనష్టం జరుగుతుందని విశ్లేషకులు భావించినప్పటికి, బీజేడీ పార్టీ అధినేత నవీన్ పట్నాయక్ స్వయంగా అభ్యర్థుల ఎంపిక, వ్యూహరచన, ప్రచార పాత్రలను పోషించారు.

ఇక కాంగ్రెస్‌లో అసంతృప్తి నేతలు బహిరంగంగానే వ్యవహరించారు. అలాగే బి.జె.పి అధ్యక్షుడు ఏకపక్షంగా వ్యవహరించడంతో ఆ పార్టీలో అసంతృప్తి వుంది. ఏమైనా వీటన్నింటికి మించి నవీన్ పట్నాయక్ పట్ల ప్రజలకున్న విశ్వాసమే ఆయనను గెలిపించింది. ■

# చోళ సామ్రాజ్యంలో స్థానిక పాలన

**ఇటు భారతదేశంలో వేదకాలంలోని గ్రామసభలకు, అటు పశ్చిమాన ప్రాచీన గ్రీస్ దేశంలోని ప్రత్యక్ష ప్రజాపాలనకు ఆధారాలు ఉన్నప్పటికీ, అటువంటి స్థానిక పాలన రూపురేఖలు తెలిపే చారిత్రక ఆధారాలు చాలా తక్కువగా ఉన్నాయని చరిత్ర గ్రంథాలు చెబుతున్నాయి. అటువంటి ఆధారాలను సమకూర్చే శిలా శాసనాలను తమిళనాడులోని ఉతిరమేరూరు అనే గ్రామంలో చరిత్ర పరిశోధకులు, పురావస్తు శాస్త్ర నిపుణులు వెలికి తీసి ఆశ్చర్యకరమైన అంశాలను ప్రకటించారు.**

దక్షిణ భారతదేశాన్ని పాలించిన గొప్ప ప్రఖ్యాతిగాంచిన రాజవంశాల్లో చోళవంశం ఒకటి. క్రీస్తు పూర్వపు శిలాశాసనల్లో చోళ రాజుల ప్రస్తావన ఉన్నప్పటికీ, ఖచ్చితమైన చారిత్రక ఆధారాల ప్రకారం నిరంతరాయంగా క్రీ.శ. 850 నుండి క్రీ.శ. 1250 వరకు మాత్రమే దక్షిణ భారతదేశంలోని అధిక భాగంతో పాటు నేటి శ్రీలంక, మాల్దీవులు చోళ సామ్రాజ్యం ఆధీనంలో ఉండేవి. ఈ నాలుగు శతాబ్దాలలో అద్భుతమైన దేవాలయాల నిర్మాణం, సాహిత్య పోషణతో పాటు చోళ రాజులు విదేశీ వాణిజ్యం, విద్య, గ్రామాలలో స్వయం పాలన పట్ల విశేషమైన శ్రద్ధ చూపించారు.

క్రీ.శ. 907 నుండి క్రీ.శ. 950 వరకు చోళ సామ్రాజ్యాధినేతగా ఉన్న పరాంతక చోళుడు ఒకటవ గ్రామ పాలనా వ్యవస్థపై ఇచ్చిన ఆదేశాలు ఉతిరమేరూరు గ్రామంలో వెలికి తీసిన శిలా శాసనంలో లిఖితమై ఉన్నాయి. క్రీ.శ. 920 నాటి ఈ శిలాశాసనంలోని వివరాల ప్రకారం గ్రామపాలనా వ్యవస్థ ఇలా ఉండేది.

**గ్రామసభల పరిధి :** గ్రామ పరిధిలో అభివృద్ధి పనుల రూపకల్పన, వాటిపై అజమాయిషీ, అవసరమైన మేరకు పన్నుల విధింపు ఇత్యాధి అంశాలపై గ్రామసభకు సంపూర్ణ స్వాతంత్ర్యముండేది. రాజుగారిచే నియమించబడిన సిబ్బంది సలహాదారులు మాత్రమే. ఆదాయం, ఖర్చు, లెక్కల పరిశీలన, అజమాయిషీ అధికారాలు గ్రామసభదే.

ప్రతి గ్రామాన్ని కొన్ని విభాగాలుగా (వార్డు) విభజించి ఒక్కో విభాగం నుంచి ఒక పౌరుణ్ణి గ్రామసభ సభ్యుడిగా ఎన్నుకోవటం జరుగుతుంది. అలా ఎన్నుకోబడిన సభ్యులను వివిధ కమిటీలలో సభ్యులుగా నియమించడం జరుగుతుంది. విద్యాధికులు, సీనియర్లు, ఇతర కమిటీలలో పనిచేసిన అనుభవం ఉన్నవారిని అతి ముఖ్యమైన సంపూర్ణ అజమాయిషీ కమిటీలో నియమించబడతారు. మిగతా సభ్యులను ఇతర కమిటీలకు నియమించడం జరుగుతుంది (నీరు & తటాకాల కమిటీ, న్యాయపాలన కమిటీ, భద్రతా కమిటీ, ఆదాయ కమిటీ, భూమి కమిటీ ఇత్యాదులు).

ఈ ఎన్నికల నిర్వహణ మరియు పైన పేర్కొనబడిన కమిటీల ఏర్పాటు బాధ్యతలు నిష్పక్షపాతం, నిజాయితీ వంటి గుణగణాలను బట్టి ప్రతి గ్రామంలో నియమితుడైన 'మధ్యస్థ' అనే అధికారి వంతు. అలాగే జమాఖర్చుల లెక్కల నిర్వహణకు ఒక అధికారి ఉంటాడు.

**గ్రామసభకు ఎన్నికలు**

- ముందుగా ప్రకటించిన తేదీన ఎన్నికల సభకు గ్రామస్థులందరూ తప్పనిసరిగా హాజరు కావాలి (జబ్బుపడిన వారు, తీర్థయాత్రలకు వెళ్ళిన వారు తప్ప).
- అందరి సమక్షంలో నిబంధనల ప్రకారం అభ్యర్థుల పేర్లను స్వీకరించి వాటిలో అర్హులైన అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తారు (వార్డు వారీగా).




చోళుల కాలంలో ఉతిర మేరూరు గ్రామంలో గ్రామసభలు జరిగినట్లు చరిత్రకారులు గుర్తించిన మండపం

- అర్హులైన అభ్యర్థుల పేర్లను తాళ పత్రాలపై వ్రాస్తారు. వాటిని ఒక బిందెలో వేస్తారు.
- ఒక నిరక్షరాస్యుడైన బాలుడు అందరి సమక్షంలో బిందెను బాగా కదిపి అందులోనుంచి లాటరీ పద్ధతిలో ఒక అభ్యర్థి తాళ పత్రం తీసి 'మధ్యస్థ'కు అందజేస్తాడు.
- మధ్యస్థ అలా తీసిన తాళపత్రంలో వున్న పేరును బిగ్గరగా చదివి ఆ అభ్యర్థి ఎన్నికైనట్లు ప్రకటిస్తాడు.
- ఈ ఎన్నిక ప్రక్రియ గ్రామంలోని ప్రతి వార్డు నుండి సభ్యుని ఎంపిక విడివిడిగా జరుగుతుంది.

**గ్రామసభ ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థి అర్హతా నిబంధనలు**

- వయసు 35కు తగ్గకుండా 70 దాటకుండా ఉండాలి.
- కనీస విద్యార్హతలు కలిగి ఉండాలి.
- శిస్తు విధింపబడిన పొలం స్వంతదారుడై ఉండాలి. ఆ శిస్తును సరిగా కడుతూ ఉండాలి.
- న్యాయపరంగా తనకు చెందిన స్థలంలో కట్టిన ఇల్లు స్వంతదారుడై ఉండాలి. న్యాయబద్ధమైన ఆదాయంతోనే ఆ ఇంటిని కట్టి ఉండాలి.
- గతంలో సభ్యుడుగా పనిచేసి ఉన్నట్లైతే, కనీసం 3 సంవత్సరాల వ్యవధి ఉండాలి. ఈ నిబంధన అతని సమీప బంధువులకు కూడా వర్తిస్తుంది.
- గతంలో నిధుల దుర్వినియోగం, లంచం, ఇతర అసాంఘిక ఘటనలలో పాత్ర ఉండరాదు.

**ఎన్నికైన సభ్యునిపై అనర్హత వేటు** (Disqualification and right to recall)

అవినీతి, నిధుల దుర్వినియోగం, లైంగిక నేరాలు, తీసికొన్న ప్రజాధనానికి సరిగా లెక్క చెప్పలేక పోవటం, సంఘ విద్రోహ చర్యలు ఇత్యాది వాటికి పాల్పడిన గ్రామసభ సభ్యులు శాశ్వతంగా సభ్యత్వానికి అనర్హులౌతారు. ఈ అనర్హత అతని దగ్గరి బంధువులకు కూడా వర్తిస్తుంది.

**పదవికాలం :** ఎన్నికైన సభ్యులు (కమిటీ సభ్యులతో సహా) ఒక సంవత్సరం పాటు పదవిలో ఉంటారు.

***చారిత్రక ఆధారాల బట్టి చోళరాజుల కాలపు నాటి గ్రామ స్వయంపాలన గురించి గమనార్హమైన అంశాలు కొన్ని :***

- ఈ ఎన్నిక విధానం గ్రామంలోని ప్రతి ఒక్క అర్హుడైన పౌరునికి తన జీవిత కాలంలో కనీసం ఒక్కసారైనా గ్రామసభ సభ్యునిగా పనిచేసే అవకాశం దొరుకుతుందనే ఉద్దేశ్యంతో రూపకల్పన చేయబడింది.
- మహారాజే సర్వాధికారి అయినప్పటికీ గ్రామానికి సంబంధించిన అభివృద్ధి, పరిపాలనా అంశాలలో గ్రామసభలకు పూర్తి స్వతంత్రముండేది. మహారాజు నియమించిన సిబ్బందికిగాని, పాళెగార్ల లాంటి ప్రాంతీయాధికారులకు గాని గ్రామపాలనలో తలదూర్చే అధికారం ఉండేది కాదు.
- గ్రామపాలన గ్రామవికాసంలో గ్రామస్థులకు ప్రత్యక్ష పాత్ర కల్పించాలనే దృఢ అభిప్రాయం చోళరాజుల ఆదేశాలలో కన్పిస్తుంది.
- మహారాజు ఆదేశాలు నియామక పత్రాలు తప్పనిసరిగా వ్రాత పూర్వకంగా ఉండినట్లు తెలుస్తోంది.
- మహారాజు ఇచ్చిన నిర్దేశక సూత్రాలకు లోబడి గ్రామపాలనా నిబంధనలను, గ్రామ రాజ్యాంగాన్ని సవరించుకొనే అధికారం గ్రామసభలకు ఉండినదని తెలుస్తోంది.
- గ్రామ పాలకుల్లోను, అధికార్లలోను నిజాయితీ, సత్ప్రవర్తనలకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తోంది.

పరాంతక చోళుడు ఒకటవ ప్రవేశపెట్టిన గ్రామ స్వయం పాలనను అతని తరువాతి రాజులు కూడా కొనసాగించడమే కాకుండా ఇంకా మెరుగు పరిచినట్లు చరిత్రకారులు చెబుతున్నాయి.

ఉదాహరణకు క్రీ.శ. 1150లో అప్పటి చోళరాజైన రాజరాజచోళుడు లిఖించిన శిలా శాసనంలో ఈ వాక్యాలున్నాయి చోళ రాజ్య ఆశయం ప్రతి పౌరుడు సంతుష్టుడై సంపూర్ణమైన, స్వేచ్ఛా జీవనం గడపటమే. అంతేకాకుండా పౌరులలో అసూయా ద్వేషాలు, వైషమ్యాలు లేకుండా చేయాలి. అన్ని రకాలైన జీవరాశుల పట్ల సాదరభావం చూపించాలి. ■

**– ఏ. నాగేశ్వరరావు,** సెంటర్‌హెడ్

*నీరు & పారిశుద్ధ్య కేంద్రం, ఎ.ఎమ్.ఆర్.అపార్డ్*

# పంచాయతీరాజ్ సంస్థలే ప్రజాస్వామ్యానికి పునాదిరాళ్ళు

**1959 అక్టోబర్ 2న రాజస్థాన్‌లో పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రారంభించిన సందర్భంలో జవహర్‌లాల్ నెహ్రూ చేసిన ప్రసంగం**

**మనదేశంలో ప్రజాస్వామ్య పరిపాలనకు పునాదిరాయి వంటి పంచాయతీరాజ్ వ్యవస్థకు ఈరోజు శ్రీకారం చుట్టబోతున్నాము. చారిత్రాత్మకంగా మరియు భౌగోళికంగా రాజస్థాన్ రాష్ట్రం మనదేశానికి హృదయ స్థానంలో ఉంది. రాజస్థాన్‌లోని పల్లెల్లో మరియు పట్టణాల్లో ఉండే ప్రజానీకమంతా ఈ ప్రజాస్వామ్య పాలనకు సంబంధించిన ఈ బృహత్తర బాధ్యతను తీసుకోవటానికి ముందుకు రావటంతో రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక చట్టం ద్వారా ఈ పరిపాలనా బాధ్యతలను ప్రజలకు అప్పగించింది. ఇది ఒక చారిత్రాత్మక ఘట్టం. అంతేకాకుండా మహాత్మాగాంధీ జన్మదినాన ఈ పంచాయతీరాజ్ వ్యవస్థకు శ్రీకారం చుట్టడం మనకు ఎంతో గర్వకారణం.**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మనదేశంలో ప్రజాస్వామ్యపాలనను ఏర్పాటు చేసుకున్నాం. దేశంలోని ప్రతీ పౌరునికీ ఓటు హక్కు కల్పించాం. రాష్ట్ర శాసనసభలకు, లోక్‌సభకు ప్రజా ప్రతినిధులను ఎన్నుకొనే హక్కును ప్రతీ పౌరుడు ఆనందంగా వినియోగించుకున్నాడు. ఓటు హక్కు వినియోగించుకోవటం ప్రజాస్వామ్యంలో ఆహ్వానించదగ్గ పరిణామయినప్పటికీ, నిజమైన ప్రజాస్వామ్యం సిద్ధించినట్లు కాదు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలలో రాజకీయ చైతన్యం వెల్లివిరిసినప్పుడే మనదేశం ప్రగతి సాధిస్తుంది. దేశం యొక్క ప్రగతి, గ్రామాల యొక్క ప్రగతితోనే ముడిపడి ఉంది. అప్పుడే మనదేశం బలీయదేశంగా ఆవిర్భవిస్తుంది. ప్రపంచంలోని ఏ శక్తి మనల్ని ప్రగతి ప్రధాన నడవకుండా ఆపలేదు.

సరిగ్గా ఏడు సంవత్సరాల క్రితం మనం సాముదాయక అభివృద్ధి ప్రాజెక్టులను, జాతీయ విస్తరణ సేవల పథకాన్ని ప్రారంభించుకోవటం ద్వారా మనం ఈ మహా ఉద్యమాన్ని ప్రారంభించుకున్నాం. ఈ రెండు కార్యక్రమాలు దేశంలోని మూడు లక్షల పై చిలుకు గ్రామాలలో అమలు చేయబడు తున్నాయి. మొత్తం మీద అద్భుతమైన పని జరిగింది. కానీ సాధించిన విజయాలు ఆశించిన రీతిలో లేవు. ఈ నత్తనడకకు కారణం మనం అది, కాం యంత్రాంగంపై విపరీతంగా ఆధారపడటమే. అధికారులకు ఉన్న విషయ పరిజ్ఞానంతో ప్రజలకు వారు సహకరించగలరే తప్ప, ప్రజలు బాధ్యత తీసుకోనిదే పనులు నిర్వహించటం సాధ్యం కాదు. అందుకే ప్రజలకు అధికారాన్ని అప్పగించాలి. బాధ్యతలు నిర్వర్తించే విధంగా వారికి తగిన శిక్షణ అందచేయాలి.



అందుకే ప్రజలకు బాధ్యతలకు పంపిణీ చేయటానికి ఒక దృఢమైన చర్య తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రక్రియలో కేవలం ప్రజలతో సంప్రదింపులు జరపటమే కాక అందుకు అవసరమయిన అధికారాలు కూడా బదలాయించాలి. అందుకే మేమంతా ఆలోచించి ప్రతీ గ్రామంలో ఒక గ్రామ పంచాయతీని అన్ని అధికారాలతో ఏర్పాటు చేయాలి, అదే విధంగా గ్రామ ఆర్థిక వ్యవహారాలను పరిపుష్టం చేయటానికి ఒక సహకార సంఘం ఉండాలి.

గ్రామ పరిపాలనకు సంబంధించిన దైనందిన వ్యవహారాలను చూడటానికి గ్రామ పంచాయితీ, గ్రామ ఆర్థిక లావాదేవీలను సహకార సంఘం నిర్వహిస్తాయి. పరిపాలనా బాధ్యతలు కేవలం కొద్ది మంది అధికారుల చేతిలో ఉండకూడదు, ఈ బాధ్యతలు 400 మిలియన్ ప్రజల మధ్య పంపిణీ జరగాలి. ప్రజలందరూ ఒకే త్రాటిపైకి వచ్చి, పరస్పరం సహకరించుకొనేలా మరియు ఒకరితో ఒకరు చర్చించుకునేలా మనం చర్యలు తీసుకోవాలి. గ్రామంలో అత్యవసరంగా ఏర్పాటు

చేసుకోవలసిన మూడవ సంస్థ ప్రాథమిక పాఠశాల. ప్రతీ గ్రామంలో ఒక పాఠశాల ఏర్పడి పిల్లలంతా మంచి విద్యను పొందగలగాలి. మహిళలకు కూడా చదువుకోవటానికి సమానమయిన అవకాశాలను కలుగజేయాలి.

మనం ఇప్పుడు రెండవ పంచవర్ష ప్రణాళికా కాలంలో ఉన్నాం. ఇది పూర్తికావటానికి ఇంకా దాదాపు ఒక సంవత్సరం వ్యవధి ఉంది. మూడవ పంచవర్ష ప్రణాళిక రూపకల్పన జరుగుతోంది. ప్రణాళికలు రూపకల్పన మరియు అభివృద్ధి పథకాలు అమలు పరిచే బాధ్యతలను ప్రజలకు బదలాయించటానికి అనువైన సమయం వచ్చింది. అందేకే నేను మిమ్మల్ని ఈ బాధ్యతలు తీసుకోవటానికి ధైర్యంగా ముందుకు రమ్మని పిలుపునిస్తున్నాను. ప్రజలకు బాధ్యతలను అప్పగిస్తే మంచి ఫలితాలు వస్తాయని, ఇది కేవలం ఒక్క రాజస్థాన్‌లోనేకాక, దేశంలో ఏ ప్రాంతంలోనైనా ఇదేవిధంగా మంచి ఫలితాలు వస్తాయనే దృఢ విశ్వాసం నాకు ఉంది.

పంచాయతీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తూ ఈ సుదినాన మీరు తీసుకున్న ఈ చారిత్రాత్మక చర్యను నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఈ పంచాయతీరాజ్ వ్యవస్థను మీరు విజయవంతం చేయాలి.

గతంలో ప్రజలకు, రాజ్యాలను పరిపాలించిన మహారాజులకు మధ్య పూడ్చలేని అగాధాలు ఉండేవి. కానీ ప్రస్తుతం పాలకులకు, పాలితులకు మధ్య బేధం తొలగిపోయింది. కొన్ని సందర్భాలలో అధికారులు సర్వస్వం తామే అన్నట్లుగా ప్రవర్తిస్తుంటారు. కానీ సర్పంచ్‌లు, ప్రెసిడెంట్‌లు ఆ విధంగా ప్రవర్తించరనే విశ్వాసం నాకుంది. పనిచేసే అధికారులు ప్రజామన్ననను అధికారంతో పొందలేరు. కానీ ఒక మంచి అధికారి 'సమానత్వం' అనే స్ఫూర్తితో పనిచేస్తారు. అప్పుడే ఆ అధికారి ఇతరులకు శిక్షణ అందచేయగలుగుతాడు. మీరంతా పరస్పర సహకార ధోరణితో పనిచేసారు. రాజకీయంగా ప్రతి ఒక్కరికీ ఓటు హక్కుంది, ఆర్థిక వ్యవహారాల్లో ప్రతీ ఒక్కరికి సమాన అవకాశాలున్నాయి. పంచాయితీలలో కూడా ప్రతీ ఒక్కరూ సమానంగా పరిగణింపబడాలి. స్త్రీలకు పురుషులకు, ఉన్నతులు నిమ్నజాతి వారు అనే బేధం ఉండకూడదు. మనమందరం ఒక్కటే అనే భావంతో, సౌభ్రాతృత్వంతో మరియు కర్తవ్య నిర్వహణలో మనపై మనకు విశ్వాసంతో ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలి.

ఈ దిశలో సాగుతున్న మనల్ని, యావత్ ప్రపంచం వేయి కళ్ళతో గమనిస్తూ ఉంటుంది. మీరు మీ కర్తవ్య నిర్వహణలో ప్రక్కదారి పట్టి, మీలో మీరు గొడవలు పడి, ముఠాలుగా జతకడితే మీ ప్రయత్నంలో సఫలీకృతులు కాలేరు. రాజస్థాన్‌లోని ప్రజలను మీరు మేల్కొల్పాలి. ఇది ఒక మహత్తరమైన కార్యం. ప్రజాస్వామ్యానికి ఈ దేశంలో ఒక దృఢమైన పునాదిని మీరు వేశారని భవిష్యత్తు తరాల వారు గర్వంగా చెప్పుకొనేలా మీరు మార్గదర్శకులు కావాలి. ■

– డా॥ వి. శివశంకర ప్రసాద్, సేకరణ, అనువాదం

## దేశంలో పంచాయితీరాజ్ సంస్థలు, ప్రజాప్రతినిధులు

| | | |
|---|---|---|
| **దేశంలో మొత్తం పంచాయితీల సంఖ్య** | - | **2,32,855** |
| **పంచాయితీ సర్పంచ్‌ల సంఖ్య** | - | **2,32,855** |
| **వార్డు సభ్యుల సంఖ్య** | - | **26,45,880** |
| **మండల/బ్లాక్ పంచాయితీల సంఖ్య** | - | **6,094** |
| **మండల/బ్లాక్ పంచాయితీ అధ్యక్షుల సంఖ్య** | - | **6,094** |
| **మండల/బ్లాక్ పంచాయితీ సభ్యుల సంఖ్య** | - | **1,56,557** |
| **జిల్లా పరిషత్‌ల సంఖ్య** | - | **633** |
| **జిల్లా పరిషత్ అధ్యక్షుల సంఖ్య** | - | **633** |
| **జిల్లా పరిషత్ సభ్యుల సంఖ్య** | - | **15,581** |

**12వ ఆర్థిక సంఘం**

**పంచాయితీలకు కేటాయించిన నిధులు**

మొత్తం కేటాయింపు – 20,000 కోట్లు

ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించినది – 1,587 కోట్లు

**13వ ఆర్థిక సంఘం**

**పంచాయితీలకు కేటాయించిన నిధులు**

మొత్తం కేటాయింపు – 56,335 కోట్లు

ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించినది – 4,671.9 కోట్లు

# పంచాయితీలలో సమాచార హక్కు చట్టం

## ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన సమాచారం

(గ్రామపంచాయితీలలో ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన సమాచారంపై రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని అపార్డ్ సంస్థ రూపొందించిన మార్గదర్శకాలను ప్రచురిస్తున్నాం. ఇవి అన్ని పంచాయితీలలో అమలు జరిగేలా కృషి చేయాలి)

**భారతదేశంలో సమాచారహక్కు చట్టం 2005 నుండి అమలులో ఉన్నప్పటికీ, నేటికినీ అమలులో, అన్వయంలో ఎవరికి తోచిన విధంగా వారు తమకు ఇబ్బంది కలగని విధంగా దారి మరల్చడానికి ప్రయత్నిస్తున్నారే తప్ప చట్టం యొక్క ఉద్దేశ్యాలు, లక్ష్యాలకు అనుగుణంగా కావలసినన్ని చర్యలు తీసుకోవటం లేదు. ప్రజాసంఘాలు, ప్రభుత్వ శిక్షణా సంస్థల ద్వారా ఎన్ని శిక్షణలు ఇచ్చినప్పటికీ అమలులో ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నట్లుగా గమనిస్తున్నాం.**

సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4 (1)(బి) అనే దానికి విస్తృతమైన అర్థం, పరిధి కలిగి ఉన్న విషయాన్ని అర్థం చేసుకోవాలి. చట్టం యొక్క లక్ష్యమైన పారదర్శకత, జవాబుదారీతనం అనే పదాలకు సెక్షన్ 4 (1)(బి)కి ముడిపడి ఉన్నది.

సమాచార హక్కు బిల్లు - 2005ను పార్లమెంటు ఆమోదించిన తర్వాత జూన్ 5, 2005న రాష్ట్రపతి ఆమోదించారు. 'సమాచార హక్కు చట్టం-2005'ని జూన్ 21, 2005న భారత్ ప్రభుత్వ గెజిట్ నెం. 25లో వచ్చింది.




సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రజాసాధికారి (పబ్లిక్ అథారిటి) చట్టం అమలులోకి వచ్చిన 120 రోజులలో, అనగా తేది. 23.09.2005/12.10.2005 వరకు తప్పనిసరిగా కొన్ని విధులను నిర్వర్తించవలసి ఉంది.

కార్యాలయంలోని రికార్డులు అన్నీ విషయసూచిక (క్యాటలాగ్) ఆధారంగా క్రమపద్ధతిలో తయారు చేసుకోవాలి. వనరులు ఉన్నట్లయితే, ముఖ్యమైన రికార్డులను కంప్యూటరైజేషన్ చేయించాలి. సమాచారాన్ని ఇంటర్‌నెట్ ద్వారా దేశ ప్రజలందరికీ అందుబాటులో ఉంచాలి.

ఈ చట్టం సెక్షన్ 4 (1)(బి) ప్రకారం చట్టం అమలులోకి



వచ్చిన 120 రోజులలో ప్రజాసాధికారి ఛాప్టర్ 2 నుండి 17లలో సూచించిన 17 అంశాలపై సమాచారాన్ని తయారుచేసి, ప్రజలకు, పౌరసంఘాలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, ఉద్యోగులకు, సమాచార అధికారులకు, అప్పిలేట్ అధికారులకు కూడా అర్థం అయ్యే విధంగా సమాచారాన్ని ఉంచాలి.

**4 (1)(బి) యొక్క ఉద్దేశ్యం**

సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4 (1)(బి) యొక్క ఉద్దేశ్యం, వివిధ సంస్థలలోని సమాచారాన్ని సానుకూలంగా వెల్లడి చేయాలని, అంటే ఎవరో వచ్చి సమాచారాన్ని అడిగేదాకా ఉండకుండా చట్టం అమలులోకి వచ్చిన 120 రోజులలో ఆ శాఖకు సంబంధించిన సమాచారాన్ని ప్రకటించాలి. జూన్ 21, 2005 నుండి 120 దినాలలో ఎలక్ట్రానిక్ పద్ధతి కాని, పుస్తక రూపంలో కాని ఈ క్రింది 17 ఛాప్టర్ల ద్వారా తయారు చేసిన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలి. అలా ఎవరూ అడగకుండా తనకు తానుగా ఆ సంస్థ సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచడమే 4 (1)(బి) ఉద్దేశ్యం.

**సమాచార హక్కు చట్టం - 2005 లోని సెక్షన్ 4 (1)(బి) ఏమి చెబుతుందో తెలుసుకుందాం**

***గ్రామ పంచాయితీలలో 4 (1)(బి)కి సంబంధించి 17 ఛాప్టర్ల గురించి తెలుసుకుందాం :***

**పంచాయితీ 4 (1)(బి) రిజిస్టర్**

**ఛాప్టర్ - 1**

గ్రామ పంచాయితీకి ప్రజాసాధికారులు (పబ్లిక్ అథారిటి) క్రింది విధంగా ఉంటారు. ఆ సంస్థ యొక్క నిర్మాణ స్వరూపం, విధులు, కర్తవ్యాల వివరాలు అనగా పంచాయితీ ఎందుకోసం ఏర్పాటు చేయబడినది, అది అందించే సేవలు, దాని ద్వారా నిర్వహించే పనులను పొందుపర్చాలి.

**సెక్షన్ 4 (1)(బి)**

**సమాచార హక్కు చట్టం - 2005**

| క్ర.సం. | అధికారి హోదా | అధికారి పేరు | ఫోన్ నెం. |
|---|---|---|---|
| 1. | ప్రజా సమాచార అధికారి | ఇ.ఓ.పి.ఆర్.ఆర్.డి | |
| 2. | సహాయ ప్రజా సమాచార అధికారి | పంచాయితీ కార్యదర్శి | |
| 3. | అప్పిలేట్ అధికారి | యం.పి.డి.ఓ | |




**గ్రామ పంచాయితీ విధులు - బాధ్యతలు**

ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం సెక్షన్ 45 ప్రకారం, పంచాయితీ విధులను ఛాప్టర్-1లో రాసుకోవాలి. ముఖ్యంగా పారిశుద్ధ్యం, లైటింగ్, అంటువ్యాధుల నివారణకు, త్రాగునీటి సరఫరా వంటి సేవలకు సంబంధించిన అన్ని విధులు ఈ ఛాప్టర్‌లో వస్తాయి (జి.ఓ. నెం.138 పి.ఆర్. తేది. 18.04.2004 రూల్స్ విడుదల చేయబడినవి).

**ఛాప్టర్ - 2**

**సెక్షన్ 4 (1)(బి) (2)**

***2. సంస్థలోని అధికారులు, ఉద్యోగుల అధికారాలు, విధులు :***

అధికారులు, ఉద్యోగులకున్న అధికారాలు, విధులు జి.ఓ. నెం.199 ప్రకారం, పంచాయితీ కార్యదర్శి విధులు క్రింద రాయాలి (జాబ్ చార్టులు రాయాలి).

| క్ర.సం. | అధికారి పేరు | అధికారి హోదా | అధికారి విధులు | ఫోన్ నెం. |
|---|---|---|---|---|
| 1. | | పంచాయితీ కార్యదర్శి | జి.ఓ.యం.ఎస్.నెం. 199 ప్రకారంగా తన విధులను రాయాలి | |
| 2. | | జూనియర్ సహాయకులు | విధులు రాయాలి | |
| 3. | | శానిటరీ ఇన్‌స్పెక్టర్ | విధులు రాయాలి | |
| 4. | | బిల్ కలెక్టర్ | విధులు రాయాలి | |
| 5. | | పంప్ ఆపరేటర్ | విధులు రాయాలి | |

**ఛాప్టర్ - 3**

**సెక్షన్ 4 (1)(బి) (3)**

***3. పర్యవేక్షణ, జవాబుదారీతనంతో సహా నిర్ణయాలు చేసే ప్రక్రియలో అనుసరించే కార్య విధానం :***

పర్యవేక్షణ, జవాబుదారీతనానికి సంబంధించిన మార్గాలతో పాటు నిర్ణయ ప్రక్రియలో అనుసరించే విధానాలు,

నిర్ణయ ప్రక్రియలో కమిటీ ఈ క్రింది విధంగా ఉంటుంది.

| | | |
|---|---|---|
| 1. సర్పంచ్ | - | అధ్యక్షతన కమిటీ సమావేశం అవుతుంది |
| 2. ఉపసర్పంచ్ | - | ఉపాధ్యక్షులు |
| 3. వార్డు సభ్యులు | - | 8 నుండి 22 మంది ఉంటారు |
| 4. మండల ప్రజా సభ్యులు | - | పై కమిటీతో నిర్ణయాలు తీసుకోబడుతాయి |

గ్రామ పంచాయితీ సమావేశాలలో విధాన నిర్ణయాలు చేస్తారు. జి.ఓ.నెం.227 పి.ఆర్.ఆర్.డి. రిలీఫ్ (ఎం.2) తేది. 13.04.0995లలో సమావేశాల రూల్సును అనుసరించి, ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టం 1994 సెక్షన్ 37, 38 & 41 ప్రకారంగా పర్యవేక్షణ, జవాబుదారీతనంతో నిర్ణయాలు చేయబడతాయి.

ప్రతిరోజూ విధి నిర్వహణలో భాగంగా పనిచేస్తున్నప్పుడు వచ్చే సమస్యలను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సిబ్బంది నిర్ణయాలు తీసుకొని పరిష్కరిస్తారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవటం, పర్యవేక్షణ చేయటం జరుగుతుందని పై ఛాప్టర్‌లో రాయాలి.

## ఛాప్టర్ - 4

### సెక్షన్ 4 (1)(బి) (4)

**4. *కార్యకలాపాలు నిర్వర్తించేందుకు రూపొందించినటువంటి ప్రమాణాలు, కార్యనిర్వహణలో పాటించే సూత్రాలు :***

ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి పంచాయితీ రాజ్ చట్టం-1994 అనుసరించి పరిపాలనలో నిర్ణయాలు తీసుకుంటారు. మీటింగ్స్ జి.ఓ.నెం.227 పి.ఆర్.ఆర్.డి. రిలీఫ్ (ఎం.2) తేది. 13.04.1995 పౌరసేవా పత్రం ప్రకారం పరిపాలనలో నిర్ణయాలు తీసుకుంటారు. పౌరసేవా పత్రం వివరాలు ఈ ఛాప్టర్‌లో రాయాలి.

## ఛాప్టర్ - 5

### సెక్షన్ 4 (1)(బి) (5)

**5. *కార్యకలాపాలు నిర్వర్తించేందుకు తమ ఉద్యోగులకు సంబంధించిన నియమాలు, నిబంధనలు, ఆదేశాలు లేదా తమ నియంత్రణ క్రింద ఉన్న లేదా ఉపయోగించే నియమాలను వివరించే సంపుటలు, రికార్డులు ఈ ఛాప్టర్‌లో రాయాలి :***

ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టం-1994 ప్రకారం, వివిధ రకాలైన ఉత్తర్వుల ద్వారా ప్రభుత్వం వారు ఇచ్చే ఆదేశాలకు అనుగుణంగా పరిపాలనలో ఉద్యోగులు నియమ నిబంధనలు పాటిస్తారు అనే విషయం తెలిసే విధంగా రాయాలి.

## ఛాప్టర్ - 6

### సెక్షన్ 4 (1)(బి) (6)

**6. *తాము కలిగి ఉన్న లేదా తమ నియంత్రణ క్రింద ఉన్న డాక్యుమెంట్లు, వర్గీకరణ వివరాలు :***

నియంత్రణలో ఉన్న పత్రాల రకాలకు సంబంధించిన ప్రకటన ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టం-1994 పంచాయితీ నిర్వహణకు ప్రభుత్వం నుండి వచ్చిన జి.ఓ.లు, సర్క్యులర్‌లు, గ్రామ పంచాయితీలో నిర్వహించే అన్ని రిజిష్టర్ల పేర్లు రాయాలి. అనగా నగదు పుస్తకం మొదలుకొని జనన, మరణ రిజిష్టర్ల వరకు మొత్తం పంచాయితీలో నిర్వహించే దాదాపు 40 రిజిష్టర్ల పేర్లు ఈ ఛాప్టర్‌లో రాయాలి.

## ఛాప్టర్ - 7

### సెక్షన్ 4 (1)(బి) (7)

**7. *తమ విధాన రూపకల్పనకు సంబంధించి లేదా దాని అమలు విషయంలో ప్రజలను సంప్రదించేందుకు లేదా వారు విజ్ఞప్తి చేసుకునేందుకు కలిగి ఉన్న ఏదైనా ఏర్పాటు వివరాలు :***

విధానాల రూపకల్పన కోసం, లేక వాటి అమలు కోసం పౌరులతో సంప్రదింపులు జరిపేందుకు లేక వారి ప్రాతినిధ్యం స్వీకరించేందుకు ఏదైనా పద్ధతి ఉన్నట్లు అయితే, దాని వివరాలు, గ్రామసభ నిర్వహణ తేదీలు 2 జనవరి, 14 ఏప్రిల్, 1 జూలై, 3 అక్టోబర్ తేదీలలో గ్రామసభ ద్వారా ప్రజలను సంప్రదిస్తారనే విషయం తెలపాలి. జి.ఓ. నెం.162 పి.ఆర్.ఆర్.డి. డిపార్ట్‌మెంట్, తేది. 04.04.1997 ప్రకారం గ్రామసభ, 227 ప్రకారం గ్రామపంచాయితీ నిర్వహణ

నిబంధనలు అనుసరించి ప్రజల అభిప్రాయాలను స్వీకరించి లేదా సంప్రదించి విధానాలను రూపొందించడం జరుగుతుంది అని రాయాలి.

## చాప్టర్ - 8

### సెక్షన్ 4 (1)(బి) (8)

***8. తమ విధానంలో భాగంగా లేదా సలహాలు పొందటం కోసం ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులతో ఏర్పాటై ఉన్న బోర్డులు, కౌన్సిళ్ళు, కమిటీలు, తదితర సంస్థల వివరాలు. ఈ బోర్డులు, కౌన్సిళ్లు, కమిటీలు, తదితర సంస్థల సమావేశాలకు ప్రజలు హాజరు కావచ్చునా? :***

1. సర్పంచ్ – అధ్యక్షతన కమిటీ సమావేశం అవుతుంది
2. ఉపసర్పంచ్ – ఉపాధ్యక్షులు
3. వార్డు సభ్యులు – 8 నుండి 22 మంది ఉంటారు
4. మండల ప్రజా సభ్యులు – పై కమిటీతో నిర్ణయాలు తీసుకోబడుతాయి

పంచాయితీ సమావేశాలకు ప్రజలను అవసరమైన సందర్భాలలో అనుమతిస్తారు. జి.ఓ. 227 ప్రకారం గ్రామ పంచాయితీలో జరిగిన సమావేశ తీర్మానాలను ప్రజలకు అందుబాటులో ఉంచుతారు. అట్టి సమావేశాల చర్చల వివరాలను ప్రజలు తెలుసుకోవచ్చును. వివరాలను పొందవచ్చు అని రాయాలి.

## చాప్టర్ - 9

### సెక్షన్ 4 (1)(బి) (9)

***9. తమ అధికారులు, ఉద్యోగుల డైరెక్టరీ :***

| క్ర.సం. | అధికారి పేరు | అధికారి హోదా | ఫోన్ నెం. |
|---|---|---|---|
| 1. | | పంచాయితీ కార్యదర్శి | |
| 2. | | జూనియర్ సహాయకులు | |
| 3. | | శానిటరీ ఇన్‌స్పెక్టర్ | |
| 4. | | బిల్ కలెక్టర్ | |
| 5. | | పంప్ ఆపరేటర్ | |

## చాప్టర్ - 10

### సెక్షన్ 4 (1)(బి) (10)

***10. తమ అధికారులు, ఉద్యోగులలో ప్రతి ఒక్కరూ తీసుకునే నెలవారీ ప్రతిఫలం తమ నిబంధనలలో వీలు కల్పించిన విధంగా పరిహారం విధానం :***

అధికారులు, ఉద్యోగులు పొందే నెలవారీ వేతనం, దాని నిబంధనల ప్రకారం పరిహారం చెల్లింపు విధానం వివరాలను రాయాలి.

| క్ర.సం. | అధికారి పేరు | అధికారి హోదా | పొందుతున్న జీతం |
|---|---|---|---|
| 1. | | పంచాయితీ కార్యదర్శి | |
| 2. | | జూనియర్ సహాయకులు | |
| 3. | | శానిటరీ ఇన్‌స్పెక్టర్ | |
| 4. | | బిల్ కలెక్టర్ | |
| 5. | | పంప్ ఆపరేటర్ | |
| 6. | | స్వీపర్స్ | |

## చాప్టర్ - 11

### సెక్షన్ 4 (1)(బి) (11)

***11. అన్ని ప్రణాళికలు, ప్రతిపాదిత వ్యయాలు, జరిపిన చెల్లింపుల వివరాలు విడివిడిగా పేర్కొంటూ దాని కింద ఉన్న అన్ని ఏజన్సీలకు కేటాయించిన బడ్జెట్ వివరాలు ఆదాయ, వ్యయ పట్టికలు క్రింద పద్దులవారీగా రాయలి :***

1. గ్రామ పంచాయితీ బడ్జెట్ వివరాలు
2. గ్రామ పంచాయితీకి వచ్చే రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు, 13వ ఆర్థిక సంఘం నిధుల, వెనుకబడిన ప్రాంతాల గ్రాంటు, ఫండ్‌కు సంబంధించిన ప్రణాళికలను (యాక్షన్‌ప్లాన్) పొందుపర్చాలి.
3. చేసిన ఖర్చులకు సంబంధించిన వివరాలు రాయాలి.
4. ఏజన్సీలకు కేటాయించిన వివరాలు.
5. గ్రామ పంచాయితీ సాధారణ నిధులు, ఆదాయ, వ్యయాల వివరాలు ఈ చాప్టర్‌లో ముద్రించాలి.

## చాప్టర్ - 12

### సెక్షన్ 4 (1)(బి) (12)

***12. సబ్సిడీ కార్యక్రమాలను అమలు పరిచే పద్ధతి, కేటాయించిన మొత్తాలు, ఆ కార్యక్రమాల లబ్ధిదారుల వివరాలు :***

1. గ్రామపంచాయితీ సబ్సిడీ పథకాలను అమలు చేయదు. కాని ఆ గ్రామానికి సంబంధించి మండలంలో సబ్సిడీ పథకాల మంజూరుకి సంబంధించిన సమాచారాన్ని సేకరించి పథకాల వారీగా రికార్డులు నిర్వహించాలి.

సబ్సిడీ పథకాల అమలుతీరు, వాటికి కేటాయించిన నిధులు, ఆ పథకాల లబ్ధిదారుల వివరాలు, సబ్సిడీలపై లోన్‌లు పొందిన వారి వివరాలు, ఎస్.సి.కార్పోరేషన్, ఎస్.టి. కార్పోరేషన్ లబ్ధిదారులు గ్రామంలో ఉంటే వారి వివరాలు సేకరించి పొందిన సబ్సిడీ వివరాలు ఈ ఛాప్టర్‌లో రాయాలి.

## ఛాప్టర్ - 13

### సెక్షన్ 4 (1)(బి) (13)

***13. రాయితీలు పొందే వారి వివరాలు, తాము మంజూరు చేసే పర్మిట్లు లేదా అనుమతుల వివరాలు :***

గ్రామంలో ఏవైనా మినహాయింపులు, అనుమతులు పొందిన లబ్ధిదారులు ఉంటే వారి వివరాలు తెలపాలి. అనగా నిరుపేదలైన కుటుంబాలవారు, గుడిసెలలో నివసిస్తున్న కుటుంబాల వారు ఇంటి పన్నులాంటి మినహాయింపులు పొంది ఉంటే ఇక్కడ వాటి వివరాలు రాయాలి. గృహ నిర్మాణ అనుమతులు పొందుతున్న వారి వివరాలు పొందుపరచాలి.

## ఛాప్టర్ - 14

### సెక్షన్ 4 (1)(బి) (14)

***14. తమ వద్ద లభ్యంగా ఉన్న లేదా తాము కలిగి ఉన్న, ఎలక్ట్రానిక్ రూపంలోకి తగ్గించబడినట్టి సమాచారానికి సంబంధించిన వివరాలు :***

అందుబాటులో ఉన్న లేక నియంత్రణలో ఉన్న సమాచారాన్ని ఎలక్ట్రానిక్ రూపంలో కుదించి ఉంటే ఆ వివరాలు కంప్యూటర్‌లో నిక్షిప్తమైన వివరాల సైటు అడ్రసు రాయాలి. అనగా ప్రియాసాఫ్ట్, పి.ఇ.యస్. (పంచాయితీ ఎంటర్ ప్రైజెస్ సూట్) సైటు వివరాలు రాయాలి. ఉదా: పంచాయితీ జి.ఓ.వి.ఇన్ లాంటివి ఈఛాప్టర్‌లో పొందుపరచాలి.

## ఛాప్టర్ - 15

### సెక్షన్ 4 (1)(బి) (15)

***15. ప్రజల ఉపయోగార్థం లైబ్రరీని లేదా రీడింగ్‌రూంను నిర్వహిస్తున్నట్లయితే వాటి పనివేళలతో సహా సమాచారం పొందడంలో పౌరులకు లభ్యమయ్యే సదుపాయాల వివరాలు :***

ప్రజల కోసం ఏదైనా గ్రంథాలయం లేక పఠనాలయం నిర్వహిస్తూ ఉండి ఉంటే వాటి పనివేళలతో పాటు, సమాచారం పొందడానికి ప్రజలకున్న సదుపాయాల వివరాలు.

ఉదా: 'గ్రంథాలయం ప్రతిరోజు ఉదయం 8 గం॥ల నుండి 11 గం॥ల వరకు, 4 గం॥ల నుండి 8 గం॥ల వరకు పనిచేస్తుంది' అనే బోర్డు రాయాలి. దానికి సంబంధించిన వివరాలు ఈ ఛాప్టర్‌లో రాయాలి.

## ఛాప్టర్ - 16

### సెక్షన్ 4 (1)(బి) (16)

***16. పౌర సమాచార అధికారుల పేర్లు, హోదా, ఇతర వివరాలు :***

పౌర సమాచార అధికారుల పేర్లు, హోదా, ఇతర వివరాలు జి.ఓ.యం.యస్.నెం. 465 పి.ఆర్.ఆర్.డి. గవర్నమెంట్ డిపార్ట్‌మెంట్, తేది:19.03.2012.

| క్ర.సం. | అధికారి పేరు | అధికారి హోదా | ఫోన్ నెం. |
|---|---|---|---|
| 1. | | ప్రజా సమాచార అధికారి, ఇ.ఓ.పి.ఆర్.డి. | |
| 2. | | సహాయ ప్రజా సమాచార అధికారి, పంచాయితీ కార్యదర్శి | |
| 3. | | అప్పిలేట్ అధికారి, యం.పి.డి.ఓ. | |

## ఛాప్టర్ - 17

### సెక్షన్ 4 (1)(బి) (17)

***17. ఇతర నిర్ణీత సమాచారం :***

నిర్ణయించిన తీరుగా ఇతర సమాచారం ఏదైనా, ఆ తర్వాత ఆ ప్రకటనలన్నిటినీ ప్రతి ఏడాది తాజా సమాచారంతో సరిచేసి మళ్లీ ప్రకటించడం. ■

**- డా॥ జి. ఆంజనేయులు**
డిప్యూటీ డైరెక్టర్ (శిక్షణ), ఎ.ఎమ్.ఆర్.అపార్డ్

# ప్రజాస్వామ్య పరిరక్షణలో సుప్రీం కోర్టు

- **పి.వి. గోపాలకృష్ణ**, అడ్వకేట్

ఇల్లలకగానే పండుగైపోయిందనుకుంటామా?

ఒక్క లాలూ జైలు కెళ్ళడంతో రాజకీయ ప్రక్షాళన పూర్తయిపోతుందా! అక్రమంగా కూడబెట్టిన ఆస్తుల మాటేమిటి? అవి ప్రజాధనంగా మారేవరకు పండుగపూర్తికాదు.

రాజకీయనాయకులు నేరస్థులుగా మారడంగాదు, నేరస్థులే రాజకీయ నాయకులైపోడానికి ప్రతి పార్టీ తన వంతు కృషి చేసింది. ప్రజాస్వామ్యాన్ని, Rule of Law ని భ్రష్టు పట్టించాయి.

ఎన్నికల నిర్వహణలో జరిగే అవకతవకలని సంస్కరించాల్సిన అవసరాన్ని మెజారిటీ ప్రజలు ఆలస్యంగానైనా గుర్తించినా, ఆటనియమాలని విస్మరించడమో లేక తమకను కూలంగా మార్చేసుకోగలిగిన మైనారిటీ ఆటగాళ్ళు ఎప్పటికప్పుడు, ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు.

ప్రజాప్రయోజనాల కోసం సుప్రీంకోర్టు ఈ మధ్యకాలంలో క్రియాశీలంగా వ్యవహరించి రాజ్యాంగపరంగా చాలా ముఖ్యమైన తీర్పులను వెలువరించింది.

**మొదటిది –** నేరనిరూపణై రెండేళ్ళపైబడి శిక్ష పడిన ప్రజా ప్రతినిధులు తక్షణమే తమ పదవి కోల్పోతారు.

**రెండోది –** పోలీసుల అదుపులోనో, జైల్లోనో ఉన్నవారు ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులు.

**మూడోది –** ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులందరూ అఫిడవిట్లో ఆస్థుల వివరాలు, నేరచరిత వివరాల పట్టికను తగిన విధంగా నింపకుండా ఖాళీగా వదిలేస్తే ఆ అభ్యర్థి దరఖాస్తును రిటర్నింగ్ అధికారులు నిరాకరించాలి. గత నెల 13ని రిసర్జన్స్ ఇండియా దాఖలు చేసిన పిటిషన్‌లో ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు తన 2002 తీర్పులోని అంశాలను తిరిగి ప్రస్తావించింది. తగిన అభ్యర్థిని ఎన్నుకోడానికి వీలుగా అభ్యర్థికి సంబంధించిన అన్ని విషయాలను తెలుసుకోడం అన్నది ఓటర్ యొక్క ప్రాథమిక హక్కు. ఈ విషయాన్ని 2002లోనే అసోసియేషన్ ఆఫ్ డెమొక్రాటిక్ రిఫాంస్ పిటిషన్‌లో సుప్రీంకోర్టు "... అభ్యర్థి పూర్వపరాలను తెలుసుకునే హక్కు ఎందువల్ల సామాన్య ఓటర్ ప్రాథమిక హక్కు కాదో మాకు అవగతం కావడంలేదు" అని, అది ఓటర్ ప్రాథమిక హక్కేనని నిర్ధారించింది. ఆర్టికల్ 19(1)(ఎ)లోని వాక్ స్వతంత్ర్య హక్కు పరిధిలోకే ఈ హక్కు కూడా వస్తుంది. దరఖాస్తు పత్రాలతో పాటు ఖాళీలను పూర్తిగా నింపిన అఫిడవిట్ కూడా అభ్యర్థులు జతపరిచేలా చూడాల్సిన బాధ్యత రిటర్నింగ్ అధికారిదే. అప్పటికి ఖాళీలతోనే అఫిడవిట్ దాఖలు చేస్తే ఆ దరఖాస్తు నిరాకరణయోగ్యమైనదే. "ఏమీలేవు", "వర్తించదు", "తెలీదు" వంటి పదాలతో ఆ ఖాళీలను భర్తీ చేయవలసిన కనీస బాధ్యత అభ్యర్థిదే. ఖాళీలు భర్తీ చేయకపోవడం ఎన్నికల నిబంధన 125ఎ(1) కింద శిక్షార్హమైన ఉల్లంఘనే అయినా దానికి దరఖాస్తు నిరాకరణ శిక్షే సరైనది. మరో శిక్ష అవసరం లేదని సుప్రీంకోర్టు భావించింది.

**నాలుగోది –** అభ్యర్థుల్లో ఎవరిని ఎన్నుకోని ఓటర్లకి తమ ఓటు నిరాకరించే హక్కు రాజ్యాంగం ఇస్తోంది. ఆ హక్కు వినియోగించుకోడానికి వీలుగా EVM లలో None of the above - NOTA - అన్న బటన్ ఏర్పాటు చేయాలి. బ్యాలట్ పేపర్లలో సైతం ఈ అవకాశం ఉండాలి. 49(ఒ) నిబంధనల కింద ఫారం 17(ఎ) నింపే ప్రక్రియ రహస్య బ్యాలట్ స్ఫూర్తికి విరుద్ధం. ఓటర్ మనోగతం బహిర్గతమైపోతుంది. NOTA ఆ లొసుగుని సరిచేస్తుంది.

**ఐదోది –** కేంద్ర సమాచార కమీషన్ వారి సౌజన్యంతో వచ్చిన మరో విప్లవాత్మక నిర్ణయం. రాజకీయ పార్టీలు సమాచార హక్కు పరిధిలోకి వస్తాయి.

ఈ తీర్పులు చాలామంది ప్రస్తుత రాజకీయ నాయకులకి మింగుడు పడనివి. ఒక్క లోక్‌సత్తా పార్టీ తప్ప ఏ పార్టీ కూడా వెంటనే ఈ తీర్పులని బహిరంగంగా స్వాగతించలేదు. అభినందించలేదు. కొద్దిమంది ఆటగాళ్ళ ఒత్తిడికి తట్టుకోలేక దేశాన్ని ముందుండి నడిపించాల్సిన నాయకుడు, పార్లమెంటును విస్మరించి అడ్డదారిని ఆర్డినెన్సు ద్వారా ఆటనియమాలను మార్చేయడానికి తెగబడ్డం దారుణం. ■

# భారత్ వృద్ధి రేటు 4.7 శాతమే

**ఈ ఏడాది భారత్ వృద్ధి రేటు అంచనాలను తగ్గించిన ప్రపంచ బ్యాంక్**

**6.1 శాతం నుంచి 4.7 శాతానికి కోత... మందగమనం, వడ్డీరేట్ల భారం**

భారత్ స్థూల ఆర్థికాభివృద్ధి (జీడీపీ) రేటు అంచనాల కోత విషయంలో ఇప్పుడు ఇక ప్రపంచ బ్యాంక్ వంతు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2013-14) వృద్ధి రేటు కేవలం 4.7 శాతమేనని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. ఇంతక్రితం 6.1 శాతం అంచనాలను తమ తాజా 'భారత్ వృద్ధి అప్‌డేట్' నివేదిక కుదించినట్లు బ్యాంక్ చీఫ్ ఎకనమిస్ట్ (దక్షిణాసియా వ్యవహారాలు) మార్టిన్ రామ్ ప్రకటించారు. 2014-15 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.2 శాతం ఉంటుందన్నది బ్యాంక్ తాజా అంచనా అని కూడా వెల్లడించారు. ఇంతక్రితం ఈ అంచనా 6.7 శాతం. అంటే వచ్చే ఆర్థిక సంవత్సరం అంచనాల్లో అరశాతం కుదింపు జరిగిందన్నమాట.

**కారణం ఇదీ...**

2013 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో భారత్ 5 శాతం వృద్ధి సాధించింది. గడచిన దశాబ్దకాలంలో వృద్ధి సగటు 8 శాతం. భారత్ వృద్ధి 2013-14లో బలహీనం కావడానికి మొదటి త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) ఆర్థిక వ్యవస్థ (4.4 శాతం వృద్ధి) పేలవ పనితీరు కారణమని ప్రపంచబ్యాంక్ తన తాజా నివేదికలో పేర్కొంది. దీనికి తోడు తదుపరి రెండు నెలల్లో అంటే జూలై – ఆగస్టు నెలల్లో బిజినెస్ సెంటిమెంట్‌లో పూర్తి ప్రతికూల ధోరణి నెలకొందని వివరించింది. కొన్ని సానుకూల అంశాలు ఉన్నప్పటికీ, ఆర్థిక సంవత్సరంలో ద్వితీయార్థంలోనూ వృద్ధి రేటుపై అధిక వడ్డీ రేట్ల భారం పడే అవకాశం ఉందని వివరించింది. ఇక మొత్తం టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం పెరుగుదల, అధిక స్థాయిల్లో కరెంట్ అకౌంట్ లోటు (క్యాడ్), ప్రభుత్వానికి వచ్చే ఆదాయం – చేసే వ్యయాల మధ్య వ్యత్యాసానికి సంబంధించిన ద్రవ్యలోటు ఒత్తిడులు ఆర్థిక వ్యవస్థ సత్వర రికవరీకి అడ్డంకిగా మారుతున్నట్లు వరల్డ్ బ్యాంక్ సీనియర్ కంట్రీ ఎకనమిస్ట్ డీనిస్ మద్విదేవ్ పేర్కొన్నారు.

**సానుకూల అంశాలు...**

ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో భారత్ ఆర్థిక వ్యవస్థకు కొంత కలిసి వచ్చే అంశాలను ప్రపంచ బ్యాంక్ నివేదిక వివరించింది. కోర్ గ్రూప్ ద్రవ్యోల్బణం (ఆహార వస్తువులు, ఇంధనం లైట్ విభాగం మినహా మిగిలిన విభాగాల టోకు ధరల సూచీ - ప్రధానంగా తయారీ రంగం) దిగిరావడం, వ్యవసాయ రంగంలో భారీ దిగుబడులు, రూపాయి బలహీనత ద్వారా ఎగుమతుల విభాగంలో లభించే ప్రయోజనాలు, విదేశీ కరెన్సీలలో రూపాయి మారకపు విలువ స్థిరత్వం వంటి అంశాలను ఈ సందర్భంగా నివేదిక ప్రస్తావించింది. సాగు ప్రాంతం 5 శాతం పెరిగిందని నివేదిక పేర్కొంది. దీనివల్ల వ్యవసాయ రంగంలో వృద్ధి గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడింది. 2012-13లో ఈ రంగం వృద్ధి 1.9 శాతం అయితే, 2013-14లో ఈ రేటు 3.4 శాతానికి చేరే అవకాశం ఉందని రామ్ వివరించారు. ఈ పరిస్థితి ద్రవ్యోల్బణంపై సానుకూల ప్రభావం చూపుతుందని విశ్లేషించారు. పారిశ్రామిక రంగం కొంత మెరుగుపడ్డంతో పాటు, ఎగుమతుల పెరుగుదల, కొత్త ప్రాజెక్టుల అమలు వంటి అంశాలు పరిస్థితులను మెరుగుపరచవచ్చని వివరించారు. గడచిన కొన్ని వారాలుగా మార్కెట్ సెంటిమెంట్ మెరుగుపడుతోందని సైతం పేర్కొన్నారు. సంస్కరణల విషయంలోనూ ఇదే సానుకూల ధోరణి ఉందన్నారు.

**డీబీఎస్ ఇండియా అంచనా 5 శాతం**

కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం భారత్ వృద్ధి రేటు దాదాపు ఐదు శాతంగా ఉంటుందని డీబీఎస్ ఇండియా తన తాజా నివేదికలో అంచనా వేసింది. 3.8 శాతం – 5 శాతం శ్రేణిలో ఈ రేటు ఉంటుందన్నది తమ అంచనా అని సంస్థ జీఎం, సీఈఓ సంజీవ్ భాసిన్ పేర్కొన్నారు. మందగమనం ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేమని పేర్కొంటూ, అందువల్ల వృద్ధిపై తక్కువ శ్రేణిలో ఖచ్చితమైన అంచనాలను చెప్పడం కూడా కష్టమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ■

# గ్రేటర్‌లో బి.పి.ఎస్. పథకం - అధికారులకు కాసుల పంట

- యల్.వి.రామరాజు



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నగరాలలో అనధికారికంగా నిర్మించిన, అనుమతించిన ప్లానును అతిక్రమించిన భవనాల క్రమబద్ధీకరణ, జరిమానా విధింపుకై ది. 31-12-2007న జి.వో.నెం.901 జారీ చేయడం జరిగింది. ది. 01-01-1985 నుండి 15-12-2007 మధ్యకాలంలో నిర్మాణం పూర్తయిన కట్టడాలకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. ప్రభుత్వ భూములు, సీలింగ్, చెరువుగర్భం, శిఖం భూములు, వివాస్పద స్థలాలు, అనధికార లేఅవుట్లలో నిర్మించిన భవనాలకు ఈ పథకం వర్తించదు.

లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో 2008 ఫిబ్రవరి నెలలో భవనాల క్రమబద్ధీకరణ గురించి చర్చావేదిక నిర్వహించడం జరిగింది. ఈ వేదికలో పాల్గొన్న వివిధ కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులు, భవన యజమానులు ప్రభుత్వం భవన నిర్మాణదారులను, అధికారులను వదిలి భవన యజమానులకు జరిమానా విధించడంపై నిరసన వ్యక్తం చేశారు. లోక్‌సత్తా పార్టీ తరపున హైకోర్టులో ప్రజాప్రయోజన వాజ్యం వేయాలని నిర్ణయం తీసుకున్నారు.

కొందరు భవన యజమానులు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకొని కొంత పరిహారం బయనాగా చెల్లించి వివిధ కారణాలతో క్రమబద్ధీకరించుకోలేదు, వారు చెల్లించిన డి.డి.లు జిహెచ్‌యంసి కార్యాలయాలలో ఉన్నాయి. ఈ పథకం అసలు లక్ష్యాన్ని తుంగలో తొక్కిన జిహెచ్‌యంసి అధికారులు, కొందరు బహుళ అంతస్థుల నిర్మాణదారులతో కలిసి కొత్త తరహా అవినీతి నాటకానికి తెరతీశారు. ఈ పథకం వర్తింపు ది. 15-12-2007లోగా పూర్తయిన కట్టడాలకు మాత్రమేకాగా 2010 మరియు 2012 సంవత్సరాలలో నిర్మించిన కట్టడాలకు కూడా జిహెచ్‌యంసి కార్యాలయాలలో ఉన్న పాత డి.డి.లు జతచేసి క్రమబద్ధీకరించారు.

2011 సెప్టెంబరు మాసంలో రాష్ట్ర హైకోర్టు ఆదేశాలతో జిహెచ్‌యంసి ఉన్నతాధికారులు ఆన్‌సైట్ రియల్ టైమ్ (ఓ.యస్.ఆర్.టి.) ద్వారా 1,862 నిర్మాణాలను చిత్రాలు తీసి పరిశీలించగా అనుమతులు తీసుకున్నవి 1,258, అనుమతి లేకుండా నిర్మించినవి 604 అని తేలినది. కాగా అనుమతి తీసుకున్నవి కూడా ప్లాను ప్రకారం నిర్మించలేదని తేలింది. ఏ.సి.బి. అధికారులు సుమారుగా 30 అక్రమ నిర్మాణాలను పరిశీలించి నోటీసులు జారీ చేయడం జరిగింది. ఈ అక్రమ నిర్మాణాలు ముఖ్యంగా హైదరాబాద్ శివారు ప్రాంతాలైన శేరిలింగంపల్లి, కుకట్‌పల్లి, రాజేంద్రనగర్, యల్.బి.నగర్ ప్రాంతాలలో ఎక్కువగా వచ్చినట్లు గుర్తించారు.

ఉన్నత న్యాయస్థానం అక్షింతలతో కదిలిన జిహెచ్‌యంసి యంత్రాంగం పలుచోట్ల ఆక్రమ నిర్మాణాలను తూతూమంత్రంగా కూల్చివేతలు చేపట్టడం జరిగింది. కానీ కూల్చివేతలు చేపట్టిన ప్రతిసారీ స్థానిక రాజకీయనాయకుల జోక్యంతో కూల్చివేతలు నిలిపివేయడం జరుగుతోంది. గత రెండు సంవత్సరాలుగా రాష్ట్రంలో ఉన్న అనిశ్చిత పరిస్థితుల దృష్ట్యా అక్రమ కట్టడాలు నిరాఠంకంగా సాగుతూ స్థానిక ప్రజాప్రతినిధులు, వారి అనుచరులు, జిహెచ్‌యంసి అధికారుల పని మూడు పువ్వులు, ఆరుకాయలుగా సాగుతోంది. పట్టణ ప్రణాళికా విభాగ అధికారులు స్వంతంగా జీతాలిస్తూ కలెక్షన్ ఏజంట్లను నియమించుకుని యిష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఏదైనా అగ్ని ప్రమాదాలు, భవనాలు కూలడంలాంటి సమస్యలు తలెత్తినపుడు అగ్నిమాపక శకటాలు తిరగడానికి కూడా అవకాశం లేనప్పుడు మాత్రమే మున్సిపల్ అధికారులు అప్పుడే ఆ సమస్యను గమనించినట్లుగా హడావుడిగా కొన్ని నిర్మాణాలపై కంటితుడుపు చర్యలు తీసుకుని తదుపరి మరచిపోతున్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళుతెరిచి అక్రమ నిర్మాణాలను కట్టడిచేసి అవినీతి అధికారులను బాధ్యులను చేస్తూ చర్యలు చేపడితే తప్ప హైదరాబాద్ మహానగర అభివృద్ధి ఇంకా అస్తవ్యస్తంగా తయారయి భవిష్యత్తు తరాలకు నగరనివాసం నరకప్రాయమౌతుంది. ■

# శంకరన్ స్మృతిలో...

- పి. రవిమారుత్

శంకరన్ జీవితం కాల్పనిక కథో, సాహసగాథో, సంచలనాత్మక విషయమో కాదు. గొప్ప ఆదర్శాలను నెలకొల్పటం కోసం చేసిన ప్రయత్నం కాదు. పతనమవుతున్న పరిపాలన వ్యవహారాలకీ, కృశించిపోతున్న మానవీయ సహానుభూతికి ఒక మనిషి జీవితంలో దొరికే జవాబు. అందుకోసం శంకరన్ జీవితం నేటి యువతకు తెలియవలసిన అవసరం ఉంది.



అక్టోబరు 22
శంకరన్ జయంతి

యస్.ఆర్.శంకరన్ జన్మతహా తమిళుడు. 1934 అక్టోబర్ 22న జన్మించాడు. 1957 సం॥ బ్యాచ్‌కి చెందిన ఐ.ఏ.ఎస్. అధికారి. మన రాష్ట్ర కేడర్‌కు కేటాయించబడ్డాడు. వృత్తిపట్ల అంకితభావం, అణగారిన వర్గాల పట్ల అచంచలమైన ప్రేమ, వ్యామోహ రహితమైన జీవన విధానం, స్వంత ఆస్తి కోసం ప్రయత్నించక పోవడం శంకరన్‌ను అరుదైన స్ఫూర్తి ప్రదాతగా నిలబెడతాయి.

శంకరన్ జిల్లా కలెక్టర్‌గా, సెక్రటరీగా, చీఫ్ సెక్రటరీగా పనిచేస్తూ కూడా అత్యంత సాధారణమైన జీవితాన్ని గడిపారు. తన వంట తానే చేసుకున్నారు. తన బట్టలు తనే ఉతుక్కున్నారు. తల్లి బాధ్యతని మోశారు. అన్ని హోదాలలో పనిచేసినా ఎప్పుడు పెద్దభవనాలలో నివసించలేదు. రిటైర్ అయ్యేవరకు కనీసం ఇల్లు కూడా లేదు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌తో, స్నేహితుల ఒత్తిడి మీద చిన్న అపార్ట్‌మెంట్ కొనుక్కొని మరణించే వరకు అందులోనే నివసించాడు.

ప్రయాణాలలో చాలావరకు సాధారణ రైలు ప్రయాణాన్ని, రిక్షాలను వినియోగించారు. స్వంత పనులకోసం అధికార యంత్రాంగాన్ని ఒక్క క్షణం కూడా వినియోగించలేదు. సాదాసీదా ఖద్దరు బట్టలే ధరించారు. పద్మవిభూషణ్‌ను సున్నితంగా తిరస్కరించిన శంకరన్‌గారు ఆ విషయం పత్రికలలో ఎక్కడా చర్చనీయాంశం కానివ్వలేదు.

బలమైన ఫ్యూడల్ విలువలున్న మన సమాజంలో శంకరన్ సింప్లిసిటీ శంకరన్ ఆచరణకు గొప్ప శక్తినిచ్చింది. తోటి ఆఫీసర్లుగానీ, ప్రభుత్వ నేతలుగానీ, రాజకీయ నాయకులుగానీ, కాంట్రాక్టర్లుగానీ శంకరన్ గారితో, ఒళ్ళు దగ్గరుంచుకొని వ్యవహరించాల్సి వచ్చేది. ఈ అసాధారణమైన వ్యక్తిగత జీవితం శంకరన్‌ని మనముందు అందుకోలేనంత ఎత్తులో నిలబెడుతుంది. కానీ శంకరన్ కోట్లాది మంది సామాన్య ప్రజల కోసం అధికారాన్ని వినియోగించిన పద్ధతి, ప్రజల సమస్యల్ని పరిష్కరించటానికి ఆలోచించిన, అనుసరించిన విధానాలు నేటికీ అవసరం, ఈనాటి తరానికి స్ఫూర్తిదాయకం.

వ్యవస్థీకృతమైన అన్ని అసమానతలను, అణచివేతలను రూపుమాపేందుకు శంకరన్ పనిచేశారు.

కర్నూలు జిల్లా నంద్యాలలో సబ్ కలెక్టర్‌గా ఉన్న కాలంలో అటవీ ప్రాంతాలలో చెంచులు అభివృద్ధికి, చెంచులు, దళితుల మధ్య భూమి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. నెల్లూరు జిల్లాలో నేటికీ శంకరన్ కాలనీలు, శంకరన్ నగర్‌లు ఉన్నాయంటే యానాదుల, దళితుల అభివృద్ధికి శంకరన్ చేసిన కృషికి అవి నిదర్శనాలు మాత్రమే.

త్రిపుర రాష్ట్రంలో ముఖ్య కార్యదర్శిగా ఉన్నకాలంలో ప్రజలకు చౌక బియ్యం ఇస్తూ శంకరన్‌గారు, త్రిపుర ముఖ్యమంత్రి నృపేన్ చక్రవర్తి ఇద్దరూ చౌకబియ్యమే వాడటం ఒక నమ్మలేని నిజం. తెలంగాణా ప్రాంతంలో వెట్టిచాకిరీ నిర్మూలనకు, జోగినీ వ్యవస్థ నిర్మూలనకు చట్టం చేయటం శంకరన్ కృషిలో భాగమే.

కేంద్ర సర్వీసులలో ఉండగా బొగ్గు గనుల జాతీయకరణ, ఆహార చట్టం అమలు, ఎస్.సి, ఎస్.టి.లకు బడ్జెట్ నిధులు మొదలైన విషయాలలో శంకరన్ కృషి చిరస్మరణీయం.

రిటైర్ అయిన తరువాత ఎన్నో పదవులు ఇవ్వజూపినా ఆయన స్వీకరించలేదు. గుర్తేదు కిడ్నాప్ తర్వాత కేంద్ర ప్రభుత్వం ఆయనకు ఇవ్వబోయిన ఐ.ఏ.ఎస్. అధికారులకు శిక్షణ ఇచ్చే లాల్‌బహదూర్ శాస్త్రి జాతీయ అకాడమీ డైరెక్టర్ పోస్టు ఇవ్వలేదు. అయినా శంకరన్ ప్రభావం నాటి కాలానికి చెందిన ఎందరో అధికారులపై చెరగని ముద్ర వేసింది. రిటైర్ తరువాత పౌరస్పందన వేదిక కన్వీనర్‌గా పనిచేసిన శంకరన్ ప్రభుత్వానికీ, నక్సలైట్లకు చర్చలు జరపటంలో కీలకపాత్ర వహించారు.

శంకరన్‌ది ఒక అసాధారణ వ్యక్తిత్వం. ప్రజల సేవకు అంకితమైన ఐ.ఏ.ఎస్. అధికారి. శంకరన్‌ను స్మరించుకోవటం మానవీయ విలువలను జ్ఞాపకం చేసుకోవటమే. ■

### కృష్ణా జిల్లా లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు

# మాగంటి వెంకట నాగేశ్వరరావు మృతి పట్ల పలువురి సంతాపం



లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు మాగంటి వెంకట నాగేశ్వరరావు (43) హఠాన్మరణం చెందారు. ఉదయపు నడక కోసం ఇంటి నుంచి బయలుదేరిన ఆయన పార్క్‌కు వెళ్తుండగా గుండెపోటుకు లోనై అక్కడే కుప్పకూలిపోయారు. స్థానికులు గమనించి నాగేశ్వరరావును చికిత్సకై ఆటోలో జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బందరు శారదానగర్ వడ్డి రంగారావుకాలనీ వాసి అయిన ఆయన కొంతకాలంగా తల్లితో కలిసి ఈడేపల్లిలో నివాసం ఉంటున్నారు. చిన్ననాటి నుంచి ఉద్యమభావాలు ఉన్న ఆయన కొంతకాలం పాత్రికేయ వృత్తిలో కొనసాగారు. జనవిజ్ఞాన వేదికతో పాటు లోక్‌సత్తా స్వచ్ఛంద సంస్థల్లో క్రియాశీలక పాత్ర పోషించిన నాగేశ్వరరావు లోక్‌సత్తా పార్టీ ఆవిర్భావానంతరం బందరు నియోజకవర్గ కన్వీనర్‌గా పని చేశారు. అనంతరం పార్టీ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సభ్యునిగా వ్యవహరిస్తూ కొద్ది నెలల క్రితం పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. 2009 శాసనసభ ఎన్నికల్లో మచిలీపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. పార్టీపరంగా చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయడంతో పాటు పలు ప్రజాచైతన్య కార్యక్రమాల్లో పాలుపంచుకుంటూ ప్రజలకు చేరువయ్యారు. పోర్టు సాధన కమిటీతో వివిధ సందర్భాల్లో అఖిలపక్ష కమిటీ సభ్యుడిగా తనదైన ముద్రను ప్రదర్శించే ఆయన నలుగురితో కలివిడిగా ఉండేవారు. నాగేశ్వరరావు మరణవార్త ఆయన పరిచయస్తులను విస్మయానికి గురిచేసింది. అవివాహితుడైన ఆయన చిన్న వయస్సులో హఠాన్మరణానికి లోనవడం బంధు, మిత్రులను దిగ్భ్రాంతికి గురిచేసింది. వివిధ పక్షాలకు చెందిన నాయకులు కొనకళ్ల జగన్నాధరావు, బొర్రా విఠల్, యుద్దనపూడి శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, కామినేని పట్టాభిరామయ్య, లింగం ఫిలిప్ తదితరులతో పాటు స్థానిక ప్రముఖులు, లోక్‌సత్తా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



## ఎం.వి. నాగేశ్వరరావు మృతి పట్ల లోక్‌సత్తా దిగ్భ్రాంతి

### జాతీయ అధ్యక్షులు జేపీ, రాష్ట్ర అధ్యక్షులు కటారి, ప్రభృతుల నివాళి

లోక్‌సత్తా పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు ఎం.వి నాగేశ్వరరావు (43) హఠాన్మరణం పట్ల పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

లోక్‌సత్తా ఉద్యమంలో, ఆ తర్వాత ఆవిర్భావం నుంచి పార్టీలో నాగేశ్వరరావు కార్యక్రమాలలో క్రియాశీల పాత్ర పోషిస్తున్నారని, సమాచార హక్కు చట్టం, జనవిజ్ఞాన వేదిక కార్యకర్తగా మచిలీపట్నం నియోజకవర్గంలో పలు ప్రజా సమస్యల మీద పోరాడారని, ఈ ఏడాది జరిగిన లోక్‌సత్తా పార్టీ అంతర్గత ఎన్నికలలో కృష్ణా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని గుర్తుచేశారు.

నాగేశ్వరరావు కుటుంబసభ్యులకు జేపీతోపాటు లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు డి.వి.వి.ఎస్ వర్మ, బండారు రామ్మోహనరావు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

**డా॥ జయప్రకాష్ నారాయణ్,** *ప్రధాన సంపాదకులు* **డి.వి.వి.యస్.వర్మ,** *సంపాదకులు*


# లోక్‌సత్తా పార్టీ 7వ వార్షికోత్సవం

## లోక్‌సత్తా టైమ్స్ ప్రత్యేక సంచిక

శ్రీ..........................................................

..........................................................

**ఆర్యా!**

డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రధాన సంపాదకులుగా లోక్‌సత్తా టైమ్స్ పత్రిక రాష్ట్రంలోని మేధావి వర్గాలలో, యువతలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. విలువైన సమాచారంతో, నిర్మాణాత్మకమైన విశ్లేషణలతో ఈ పత్రిక అందరినీ ఆకట్టుకుంది.

లోక్‌సత్తా పార్టీ 7వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని లోక్‌సత్తా టైమ్స్ ప్రత్యేక సంచికను (నవంబర్ 16-30) వెలువరిస్తున్నది.

రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ, ఆర్థిక, సామాజిక స్థితిగతులపై విలువైన సమాచారంతో ప్రత్యేక వ్యాసాలను ఈ సంచికలో అందిస్తుంది. అలాగే 7 సంవత్సరాలుగా లోక్‌సత్తా పార్టీ సాగించిన ఉద్యమాలు, సాధించిన విజయాలపై సమీక్షలను క్రోడీకరించి ఒక అపురూపమైన సంచికగా దీనిని రూపొందిస్తున్నాం.

లోక్‌సత్తా టైమ్స్ ప్రత్యేక సంచికలకు ప్రకటనకర్తల నుండి ఎల్లప్పుడూ ఎంతో ప్రోత్సాహం లభిస్తున్నది. ఈ సంచికను కూడా మీ వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక, విద్య, వైద్య సంస్థల ప్రకటనలు ఇచ్చి సహాయ సహకారాలను అందించాల్సిందిగా కోరుతున్నాం.

**మీ ప్రకటనలు, చెక్కులు, డ్రాఫ్టులు, నగదు ఈ క్రింది అడ్రసుకు నవంబర్ 10వ తేదీలోగా అందేలా పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.**

**అభినందనలతో....**

**(డి.వి.వి.యస్. వర్మ)**

సెల్: *9866074023*

## లోక్‌సత్తా టైమ్స్

**ప్రత్యేక సంచిక ప్రకటన రేట్లు :**

| | బ్లాక్ & వైట్, | కలర్ |
|---|---|---|
| పూర్తి పేజీ | రూ॥ 5000 | రూ॥ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | రూ॥ 10,000 | రూ॥ 20,000 |
| బ్యాక్‌పేజి | - | రూ॥ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | రూ॥ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | రూ॥ 15,000 |
| పూర్తి పేజీ సైజు | 7.5″ × 10.5″ | అంగుళాలు |
| బ్యాక్ పేజీ సైజు | 7.5″ × 8″ | అంగుళాలు |

## ప్రకటనలు, చెక్కులు, డ్రాఫ్టులు

మీరు పంపించే చెక్కులు, డ్రాఫ్టులు

***లోక్‌సత్తా టైమ్స్ హైదరాబాద్,*** పేరుతో తీసుకోవాలి.

(నగదు అయితే ఈ ఎకౌంట్ నం: 62007167836

ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్‌కు జమచేసి రశీదు పంపండి)

**ప్రకటనలు, డ్రాఫ్టులు, చెక్కులు ఈ క్రింది చిరునామాకు పంపించాలి**


**లోక్‌సత్తా టైమ్స్,**

*ఇం.నం. 8-2-674బి, ప్లాట్ నం. 93,హ్యాపీ వ్యాలి, రోడ్ నం. 13ఎ, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034. ఫోన్ : 040 23311817, 23311819.* **Email Id : loksattatimeslsp@gmail.com**

# అపార్డ్ లో సురాజ్య ఉద్యమ ఫొటో ప్రదర్శన

సెప్టెంబర్ 27న హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని యేలిమినేటి మాధవరెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ (AMR- APARD) లో సురాజ్య ఉద్యమ ఫొటో ప్రదర్శన, 'పల్లెలు-వెలుగు నీడలు' నిర్వహించారు. జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ డా॥ యం.వి.రావ్,IAS., సురాజ్య ఉద్యమ సారధ్య సంఘ సభ్యులు శ్రీ సోలిపేట రామచంద్రారెడ్డి, APARD జాయింట్ డైరెక్టర్ శ్రీ నాగరాజు, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (TISS) డిప్యూటీ డైరెక్టర్ శ్రీమతి లక్ష్మి లింగం 'జ్యోతి ప్రజల్వన' చేసి ఫొటో ప్రదర్శన ప్రారంభించారు. ఈ ప్రదర్శనను APARD ఉద్యోగులు, ట్రెయినీలు, TISS విద్యార్థులు, NIRD క్యాంపస్‌లోని PGDRDM విద్యార్థులు, భారతీయ విద్యాభవన్ స్కూల్ విద్యార్థులు తిలకించారు.





# సురాజ్య ఉద్యమం వెబ్‌సైట్ ప్రారంభం

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దూసుకెళ్తున్న యువత సమాజం కోసం కొంత సమయాన్ని కేటాయించాలని లోక్‌సత్తా పార్టీ అధినేత డా॥ జయప్రకాష్ నారాయణ్ సూచించారు. ఐమాక్స్‌లో సురాజ్య ఉద్యమంలో భాగంగా **www.surajyaportal.com** అనే వెబ్‌సైట్‌ను ఆయన ఆవిష్కరించారు. యువత సాధికారత, సుపరిపాలన ముఖ్య లక్ష్యంగా గత 14 నెలలుగా సురాజ్య ఉద్యమం సాగుతోంది.

ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ ఉద్యమంలో ఎంతోమంది యువత పాల్గొనేందుకు ముందుకు వస్తున్నందున వారికి ఓ ప్లాట్‌ఫాం నిర్మించాలనే ఉద్దేశ్యంతో ఈ వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పల్లెలు – వెలుగు నీడలు పేరిట జరిగిన కార్యక్రమానికి చెందిన చిత్ర ప్రదర్శనను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రామచంద్రారెడ్డి, మార్గదర్శి ఎండి శైలజాకిరణ్, సీఎల్ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.





హైదరాబాద్

# గాంధీ రాజకీయం కావాలి - బ్రాందీ రాజకీయం పోవాలి

అక్టోబర్ 2న గాంధీజయంతి మరియు లోక్‌సత్తా పార్టీ 7వ వార్షికోత్సవ సందర్భంగా విజయనగరం జిల్లా, చీపురుపల్లి నియోజకవర్గంలో ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు రెడ్డి లక్ష్మునాయుడు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యకర్తలతో కలిసి పార్టీ ఆఫీసులో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కార్యాలయం ముందు పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం గాంధీ విగ్రహాలున్న గ్రామాలు వంగపల్లిపేట, చీపురుపల్లి, కోనూరు, పి.యస్.లక్ష్మీపురం, గరివిడి, కె.ఎల్.పురం, వెదుళ్ళవలసకు వెళ్ళి గాంధీ విగ్రహాలకు స్థానికులతో కలిసి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆ తర్వాత చీపురుపల్లిలోని మూడురోడ్ల కూడలిలో గ్రామస్థులకు మహాత్మగాంధీ గొప్పతనం వివరించారు. గాంధీజీ స్ఫూర్తితోనే లోక్‌సత్తా పార్టీ ప్రారంభించడం జరిగిందన్నారు. సంప్రదాయ పార్టీలు, ప్రభుత్వాలు గ్రామాలను విస్మరించాయన్నారు. కాంగ్రెస్, తెలుగుదేశం, వైకాపాలను నమ్ముకుంటే కుక్కతోక పట్టుకొని గోదావరి ఈదినట్లేనన్నారు. ముఖ్యంగా యువత వారి వెనుక వెళ్ళి బ్రాందీలు పంచడం మాని లోక్‌సత్తా పార్టీలో చేరి నాయకులుగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమలో ఉపాధ్యక్షులు యందవరమణ, కార్యదర్శి జి.సత్యనారాయణ, ఆర్.అప్పలనాయుడు, ఆర్.దాలినాయుడు, ఎ.వెంకటరమణ, ఎలకల శ్రీహరి, టి. రామకృష్ణ పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.




# గాంధీజీ అడుగు జాడల్లో నడుద్దాం

స్థానిక ఆర్.టి.సి. సర్కిల్, గాంధీ విగ్రహం వద్ద గాంధీ జయంతి సందర్భంగా లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు సిద్ధయ్య నాయుడు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు బెల్లంకొండ సురేష్ మాట్లాడుతూ మన భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి మహాత్మాగాంధీ కేవలం అహింస మరియు సత్యాగ్రహం అనే నినాదంతో ఆయుధాలుగా ఎంచుకొని రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కూల్చడం జరిగిందని అన్నారు. ఈరోజు అఖండ భారతదేశము భిన్నత్వంలో ఏకత్వంగా సమైక్యంగా వుందంటే కారణం ఖచ్చితంగా గాంధీ చలువేనని అన్నారు. ప్రజలు గాంధీగారి అడుగుజాడల్లో నడవాలని ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కె.బాలసుబ్రమణ్యం, ఉపాధ్యక్షులు మదనమోహన్, జయరాజ్, నాయకులు మునిచంద్ర, రాఘవరెడ్డి, చంద్రబాబు, రమణయ్య, సుబ్రమణ్యం, ధనంజయ, కిరణ్, ప్రసాద్, హరి, సాగర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.



# లోక్‌సత్తా బుక్‌స్టాల్‌కు విశేష ఆదరణ




లోక్‌సత్తా పార్టీ సనత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన బుక్‌స్టాల్‌కు విశేష ఆదరణ లభించింది. బుక్‌స్టాల్‌ను ప్రారంభించిన హైమాప్రవీణ్ మాట్లాడుతూ లోక్‌సత్తాకి అధికారం ఇస్తే తెచ్చే మొట్టమొదటి మార్పు అర్హులైన యువత అందరికి ఉపాధి అని అన్నారు. వందలాదిగా యువత స్టాల్ వద్దకు వచ్చి లోక్‌సత్తా ప్రభుత్వంలో వస్తే ఇచ్చే 50 గ్యారంటీలను అడిగి తెలుసుకున్నారు. ఒక దశాబ్దకాలం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వల్ల ఒకతరం నష్టపోయామని హైమాప్రవీణ్ అన్నారు. ఈ బుక్ ఎగ్జిబిషన్‌ను నియోజకవర్గంలోని 60 ముఖ్య కూడళ్లో రానున్న 3 నెలల్లో పెట్టనున్నట్టు కార్యదర్శి రాజీవ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో హైమాప్రవీణ్, రాజీవ్, కిరణ్, విమల, అమీర్‌పేట రమాదేవి, భాను, రమాదేవి, కస్తూరి, లెనిన్, సతీష్ పాల్గొన్నారు.

# అవినీతిలేని సమాజ స్థాపనే లోక్‌సత్తా ధ్యేయం

చర్ల

అవినీతి, అక్రమాలకు చోటులేని సమాజ నిర్మాణమే లోక్‌సత్తా పార్టీ ధ్యేయమని ఆ పార్టీ భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు వెంగళ వెంకటరమణ అన్నారు. లోక్‌సత్తా పార్టీ 7వ వార్షికోత్సవ వేడుక చర్లలో నిర్వహించారు. 2006లో గాంధీజయంతి రోజున పార్టీ ఆవిర్భావం జరిగింది. ఈ నేపథ్యంలో లోక్‌సత్తా నాయకులు, కార్యకర్తలు తొలుత అంబేద్కర్ సెంటర్లో పార్టీ జెండా దిమ్మె వద్ద గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం లోక్‌సత్తా జెండాని ఆవిష్కరించి మాట్లాడుతూ, నేరచరిత ఉన్నవాళ్ళను చట్టసభల్లోకి ఎన్నుకోవడం వలన అవినీతి, ఆర్థిక నేరాలు జరుగుతున్నాయన్నారు. ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బు, మద్యం ఖర్చుపెట్టి ఓటర్లను ప్రలోభపెట్టి గెలిచి ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని, అభివృద్ధి కనుచూపు మేరలో కూడ కనిపించడం లేదని, ప్రజాప్రతినిధులు, నాయకులు కుబేరులు అవుతుండగా, ప్రజాసమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరబోగాచారి, చింతూరి వెంకటేశ్వరరావు, చెన్నుమళ్ళ నాగేశ్వరరావు, షాహీం, నడింపెల్లి రాము, బసవయ్య, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక సమస్యలపై పోరుకు సిద్ధం కావాలి




చైతన్యపురిలో జరిగిన లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ అధ్యక్షుడు దోసపాటి రాము, కార్యదర్శి వేణు గోపాల్‌రావు, యువ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు శివాజీ రాజు, గ్రేటర్ యువసత్తా నాయకుడు బాబురావు, ఎల్.బి.నగర్ అధ్యక్షుడు జన్నెపల్లి శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రస్తుతం నియోజకవర్గంలో రోడ్లు అత్యంత దారుణంగా తయారయ్యాయని ప్రజలు పడుతున్న ఇబ్బందులు దృష్టిలో వుంచుకొని లోక్‌సత్తా కార్యకర్తలు జిహెచ్‌యంసి అధికారులను, కార్పొరేటర్లను కలిసి వెంటనే రోడ్ల మరమ్మత్తులు చేసేవరకు పోరాడాలని గ్రేటర్ అధ్యక్షుడు దోసపాటి రాము తెలిపారు.

యువసత్తా శివాజీరాజు మాట్లాడుతూ.. యువత అత్యధికంగా వున్నా యువత సమస్యలను పరిష్కరించడంలో పాలకులు వైఫల్యం చెందారన్నారు.

యల్.బి.నగర్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ సమస్యల మీద పోరాడుతూ పార్టీని బలోపేతం చేయటానికి ప్రతి కార్యకర్త నిత్యం ప్రజల్లో వుంటూ సమస్యలు పరిష్కరించడంలో ముందు వుండాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో నక్క సంజీవ్‌గౌడ్, కొండలరెడ్డి, జాకీర్, శ్రీనివాసమూర్తి, జి.ఎల్.నరసింహరావు, రాజేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# విజయనగరం చరిత్రపై చెరగని మరక



లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి భీశెట్టి బాబీ మాట్లాడుతూ విజయనగరం జిల్లా చరిత్రలో ఉద్రేకాలకు, విధ్వంసకు జిల్లా ప్రజలు ఎప్పుడూ గురికాలేదని అన్నారు. విభజన ప్రక్రియను నిరసిస్తూ ప్రజలు ఒక్కసారిగా తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేసారని ఈ క్రమంలోనే పట్టుతప్పిన కొంతమంది నిర్మాణాత్మకంగా సాగవలసిన నిరసనను వ్యక్తులపైకి తీసుకెళ్ళారని విజయనగరం పట్టణమంతా కర్ఫ్యూ విధించడం వలన రాష్ట్రంలో విజయనగరం చరిత్ర మసకబారిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువసత్తా అధ్యక్షులు పి.వి.రమణ, చింతపూడి అప్పలరాజు, ఆర్.సుధాకర్, యం.సుభద్రాదేవి, జగదాంబ, మహేష్, ప్రసాద్, కాంతారావు, భాస్కర్, ఎర్రిబాబు తదితరులు పాల్గొన్నారు.

# చిరస్మరణీయుడు వీరజవాను శ్రీనివాసరావు

**మెంటాడ**

దేశాన్ని రక్షించే చర్యల్లో భాగంగా తన ప్రాణాలను పణంగా పెట్టిన మీసాల శ్రీనివాసరావు చిరస్మరణీయుడని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి భీశెట్టి బాబ్జీ పేర్కొన్నారు. శ్రీనివాసరావు దశదిన కర్మ సందర్భంగా విజయనగరం జిల్లా, మెంటాడ గ్రామంలో జరిగిన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధ్యక్షులు దేవర ఈశ్వరరావు, మెంటాడ గ్రామసర్పంచి పాండ్రంకి కొండమ్మ తదితరులు పాల్గొని శ్రీనివాసరావుకి నివాళులర్పించారు. శ్రీనివాసరావు విగ్రహం ఏర్పాటుకు అయ్యే మొత్తం ఖర్చు భరించనున్నట్లు ఎస్పీ కార్యాలయంలో పనిచేస్తున్న రెట్టంగి శంకరరావు సభలో ప్రకటించారు. అంతేకాక శ్రీనివాసరావు పేరు మీద ఛారిటబుల్ ట్రస్ట్‌ను స్థాపించనున్నట్లు అతని స్నేహితులు, గ్రామస్థులు తెలిపారు.

# యథేచ్ఛగా మద్యం అమ్మకాలు.. అడ్డుకోని ఎక్సైజ్ అధికారులు

**విజయనగరం**

గాంధీ జయంతి రోజున మద్యం అమ్మకాలు చేపట్టరాదనే నిబంధనలున్నప్పటికీ పట్టణంలో వాటికి తూట్లు పొడిచారని లోక్‌సత్తా నాయకులు ఆగ్రహం వ్యక్తం చేసారు. పట్టణంతోపాటు పట్టణ శివారు ప్రాంతాలైన కెఎల్.పురం, అయ్యన్నపేట తదితర ప్రాంతాల్లో మద్యం అమ్మకాలు జరిగాయని, గాంధీ జయంతి రోజు కూడా బ్రాందీ అమ్మకాలు జరిగినా ఎక్సైజ్ అధికారులు అడ్డుకట్ట వేయలేకపోయారని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు డొంకాడ సాయిపార్థసారధి ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీజయంతి సందర్భంగా పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం వద్దనున్న గాంధీ విగ్రహానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. గాంధీ తెచ్చిన స్వాతంత్ర్యాన్ని కొంతమంది దుర్వినియోగం చేస్తూ ఆయన కలలకు తూట్లు పొడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. అనంతరం పట్టణంలోని రైల్వేస్టేషన్, ఆర్టీవో కార్యాలయం సమీపంలోని దాబా, కెఎల్.పురంలోని పలు బెల్టుషాపుల్లో జరుగుతున్న మద్యం అమ్మకాలను ఆ పార్టీ నాయకులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చింతపూడి అప్పలరాజు, పి.వి.రమణ, ఎల్.ఆర్.శివరామారావు, ఆర్.సుధాకర్, సునీల్, మొల్లేటి నాయుడు, తిప్పాన కోటేశ్వరరావు, అర్జున్, కాశీపతి, ప్రసాద్, మహేష్, పెంటయ్య పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

**అమ్మపాలెం**

ఖమ్మం జిల్లా, కొణిజర్ల మండల పరిధిలోని అమ్మపాలెం గ్రామంలో పారిశుద్ధ్య పనులు, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ లోక్‌సత్తా వైరా డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ పి. శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా జిల్లా నాయకుడు కె.బాలస్వామి, వి.జ్యోత్స్న మాట్లాడుతూ గ్రామంలో రోడ్లు బురదమయంగా ఉన్నాయని, డ్రయినేజి వ్యవస్థ సరిగా లేక మురుగునీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. అమ్మపాలెం గ్రామంలో రక్షిత మంచినీటి పథకం పనిచేయక పోవడంతో చేతిపంపు నుంచి వచ్చే ఫ్లోరైడ్ నీటిని తాగుతున్నారన్నారు. దీంతో రోగనిరోధక శక్తి తగ్గి, ఎక్కువ మంది జ్వరాల భారిన పడుతున్నారని వాపోయ్యారు. యుద్ధ ప్రతిపాదికన గ్రామాల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి దోమల నివారణ మందులు పిచికారి చేయించాలని వినతి పత్రంలో కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో లోక్‌సత్తా నాయకుడు కె.రాధాకృష్ణ, గ్రామస్తులు ఉన్నారు.

## 'వాక్ ఫర్ గుడ్ పాలిటిక్స్'

**మధురానగర్ :** గాంధీజయంతితో పాటు పార్టీ 7వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 'వాక్ ఫర్ గుడ్ పాలిటిక్స్' పేరుతో వెంగళరావునగర్ డివిజన్‌లో వినూత్న కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజకీయ వ్యవస్థ వైఫల్యం కారణంగానే దేశంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయని అని అన్నారు. అనంతరం కృష్ణకాంత్ పార్కు నుండి యాదగిరి నగర్‌లోని పార్టీ పౌరసేవా కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారి రామ్మోహనరావు, జూబ్లీహిల్స్ నియోజకవర్గ అధ్యక్షుడు సాంబిరెడ్డి, అన్నపూర్ణ, సుధాశేఖర్, పవన్, వి.వి.రాజు, ప్రదీప్, రాజు, శివశంకర్, అప్పారావు, రాజారామ్, సరోజా, వాసు, కొండల్‌రెడ్డి, కాశీరావు, విజయ్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, శంకర్, పుష్ప, ప్రవీణ్, విక్రమ్ పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు

## "యువత - రాజకీయాలు" పై సదస్సు

**అమీర్‌పేట :** నియోజకవర్గ అధ్యక్షులు సాంబిరెడ్డి ఆధ్వర్యంలో లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో యువత-రాజకీయాలపై జరిగిన సదస్సులో లోక్‌సత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా అవినీతిపరుల ఆటకట్టించాలని పిలుపునిచ్చారు. సదస్సులో పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు సాంబిరెడ్డి, అన్నపూర్ణ, వి.వి.రాజు, సుబ్రమణ్యం, రమ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

**యూసుఫ్‌గూడ :** ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ సూర్యనారాయణ అన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరి చౌరస్తాలో లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి సహకారంతో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లోక్‌సత్తా పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ అధ్యక్షుడు సాంబిరెడ్డి మాట్లాడుతూ పేదవారు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ప్రజలకు ఉచితంగా న్యాయసేవలు

ప్రజలకు ఉచితంగా న్యాయసేవలు అందించడానికి లోక్‌సత్తా పార్టీ రహ్మత్‌నగర్ పౌరసేవ కేంద్రంలో అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. వినియోగ దారులకు సంబంధించిన అన్ని రకాల కేసులకు సలహాలను హైకోర్టు న్యాయవాది శ్రీనివాస్ అందజేస్తారని జూబ్లీహిల్స్ నియోజకవర్గ అధ్యక్షుడు సాంబిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి శ్రీధర్, ఉపాధ్యక్షుడు రాజ్, సుధాశేఖర్, సుబ్రమణ్యం, శివశంకర్, అప్పారావు, తిరుమలరావు, ఉమ, నరసింహ, శ్రీవాణి, చెన్నమ్మ పాల్గొన్నారు.

## ఉద్యోగ మేళాకు విశేష స్పందన

**మధురానగర్ :** వెంగళరావునగర్ డివిజన్ యాదగిరి నగర్‌లో లోక్‌సత్తా పార్టీ నిర్వహించిన ఉద్యోగ మేళాకు నిరుద్యోగుల నుంచి మంచి స్పందన లభించింది. పార్టీ పౌరసేవా కేంద్రంలో అపోలో ఫార్మసి పోస్టుల కోసం నిర్వహించిన ఈ మేళాలో అర్హులైన అభ్యర్థులను నిర్వాహకులు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు బొంతు సాంబిరెడ్డి, పార్టీ నాయకులు సుబ్రమణ్యం, శ్రీనివాస్, అప్పారావు, నరసింహ, రాజారామ్, ఇమ్రాన్, సాయినరేందర్, అపోలో ఫార్మసి సిబ్బంది పాల్గొన్నారు.

## పౌరసేవలను మెరుగు పర్చాలి

**రహ్మత్‌నగర్ :** ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పౌరులకు అందజేసే సేవల పత్రాన్ని చౌక ధరల దుకాణాల్లో ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా పార్టీ ప్రతినిధులు కోరారు. డివిజన్‌లోని పలు దుకాణాలను వారు పరిశీలించారు. రచ్చబండ కార్యక్రమాన్ని వెంటనే నిర్వహించి అర్హులైన పేదలకు రేషన్‌కార్డులను అందజేయాలని కోరారు.

## పాలకుల నిర్లక్ష్యంతోనే నిరుద్యోగ సమస్య

**మధురానగర్ :** నియోజకవర్గ అధ్యక్షులు బొంతు సాంబిరెడ్డి పలువురు యువకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షులు వి.వి.రాజు, సెల్ అధ్యక్షులు కాశీరావు, నేతలు శివశంకర్, రాజారామ్, విన్సెంట్, సందీప్ పాల్గొన్నారు.



నాంపల్లి నియోజకవర్గంలో గాంధీ జయంతి



అనంతపురంలో గాంధీజీకి నివాళి




జూబ్లీహిల్స్‌లో వాక్ ఫర్ గుడ్ పాలిటిక్స్




జూబ్లీహిల్స్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం



విశాఖపట్టణంలో రక్తదాన శిబిరం



జూబ్లీహిల్స్‌లో ఉద్యోగమేళా



విశాఖలో లోక్‌సత్తా పార్టీ 7వ వార్షికోత్సవ సందర్భంగా రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నాయకులు

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2013-15 Published on 16th October, 2013



సురాజ్య ఉద్యమ వెబ్ పోర్టల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో
డా॥ జయప్రకాష్ నారాయణ్, శైలజా కిరణ్,
సోలిపేట రామచంద్రారెడ్డి ప్రభృతులు

If not delivered please return to:

To,

Book-Post
PRINTED MATTER

**Lok Satta Times**
8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad